
ఆంధ్రజ్యోతి
****
గరిష్టం 31.0
కనిష్టం 23.0
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 5 అక్టోబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.8030)	2,59,147	2,59,147
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	2,579.96	3,178.37
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.422 (40.3981)	1,96,031	1,85,403

చికెన్ ధరలు	లైవ్ : రూ.130	డ్రెస్ : రూ.200	స్కిన్‌లెస్ : రూ.230



దసరాకు పల్లెలకు వెళ్లిన నగరం వాసులు తిరుగుప్రయాణమయ్యారు. వాహనాల్లో బయల్దేరడంతో జాతీయ రహదారులపై రద్దీ ఏర్పడింది. టోల్‌ప్లాజాల వద్ద సైతం వాహనాలు నెమ్మదిగా కదలడంతో కొంత ట్రాఫిక్‌జాం అయింది. 7



దసరా సెలవులు ముగిసినా యాదగిరిగుట్ట ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో నృసింహుడిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. 7



ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. దసరా సెలవులు ముగుస్తుండటం, వారాంతం కావడంతో సాగర్ 26 క్రస్ట్‌గేట్లను తెరిచి ఉండటంతో కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో సాగర్‌కు తరలివచ్చారు.



నివాళులర్పిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, తదితరులు

దామన్నకు కన్నీటి వీడ్కోలు



- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి
- భారీగా తరలివచ్చిన అభిమానులు 7

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో అధికార లాంఛనాలతో నిర్వహించారు. అంత్యక్రియల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఆర్డీఆర్ చితికి తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి నిప్పటించారు. దామోదర్‌రెడ్డి భౌతికకాయాన్ని చివరిసారిగా చూసేందుకు ప్రజలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

సాగర్‌కు తగ్గిన వరద

26 గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల 7

సానుభూతి రాజకీయాలకు అవకాశం ఇవ్వొద్దు

వేనేపల్లి పాండురంగారావు

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు ముహూర్తం దగ్గరపడుతుండటంతో రాజకీయపార్టీల పొత్తులపై కసరత్తు మొదలైంది. ఉమ్మడి జిల్లాలో కీలక ఓటు బ్యాంక్, క్యాడర్ ఉన్న కమ్యూనిస్టు పార్టీలతో పొత్తులు, సీట్ల సర్దుబాటుపై చర్చ సాగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల నుంచి కాంగ్రెస్‌తో సీపీఐ అధికారికంగా పొత్తు కొనసాగడంతో ఈ ఎన్నికల్లోనూ అధికార కాంగ్రెస్‌తో పాటు, సీపీఎంతోనూ సీపీఐ మైత్రి సాగించాలని ప్రాథమికంగా నిర్ణయించింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



పొత్తులు పొడిచేనా?

అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా బరిలో నిలిచిన సీపీఎం, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రధాన భాగస్వామ్యమైన ఇండియా కూటమితో కలిసి పనిచేయగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐతో పొత్తును కొనసాగిస్తూ కాంగ్రెస్ కలిసి వస్తే ఆ పార్టీతో ఎన్నికలకు వెళ్లాలని భావిస్తోంది. ఈ పొత్తులపై ఇప్పటికే వామపక్ష పార్టీల్లో చర్చ మొదలైనా కాంగ్రెస్‌లో నియోజకవర్గాల్లో అక్కడక్కడా ముఖ్యనేతలు మాట్లాడుతున్నా, పార్టీ పరంగా నిర్ణయం వెలువడాల్సి ఉంది. నోటిఫికేషన్ వచ్చేనాటికి పొత్తులపై స్పష్టత వస్తుందనే అంచనా కాంగ్రెస్, కమ్యూనిస్టు నేతల్లో కనిపిస్తోంది.

- వామపక్షాలతో కాంగ్రెస్ మైత్రికి ఛాన్స్!
- బలమున్నచోట్ల సీట్లు కోరుతున్న వామపక్షాలు
- పొత్తులతో సంబంధం లేకుండా అభ్యర్థుల ఎంపికకు కాంగ్రెస్ కసరత్తు
- కాంగ్రెస్‌కు సవాల్ విసురుతున్న బీఆర్ఎస్
- అన్ని సీట్లలో పోటీచేసి సత్తాచాటాలని బీజేపీ నిర్ణయం

బలమున్న చోట స్థానాలను కోరే యోచనలో సీపీఐ

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకున్న సీపీఐ, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లోనూ మైత్రిని కొనసాగించింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కుదిరిన అవగాహన మేరకు ఆ పార్టీకి దక్కిన ఎమ్మెల్సీ స్థానాన్ని సైతం పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యానికి కేటాయించడం ద్వారా సీపీఐ జిల్లాలో ప్రాధాన్యాన్ని నిలబెట్టుకుంది. ఇదే ఒరవడిలో తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఆ పార్టీ కాంగ్రెస్‌తో మైత్రిని కొనసాగించడంతో పాటు, సోదర వామపక్ష పార్టీ సీపీఎంతోనూ కలిసి వెళ్లాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. సీపీఐకి పట్టున్న దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో జడ్పీటీసీ, ఎంపీపీ పదవులతో పాటు, మండలాల్లో ఎంపీటీసీ స్థానాలు, సర్పంచ్ పదవులను ఆశిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇతర నియోజకవర్గాల్లోనూ పార్టీకి బలమున్నచోట ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను పొత్తులో భాగాంగా కోరాలని భావిస్తోంది. ఈనెల 8వతేదీ తర్వాత పొత్తులపై స్పష్టత వస్తుందని చెబుతున్న పార్టీ నేతలు మరోవైపు క్యాడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు.

కలిసొచ్చే పార్టీతో పొత్తుకు సిద్ధమవుతున్న సీపీఎం

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒంటరిగా పోటీ చేసిన సీపీఎం, లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిలో ఉంటూ నల్లగొండ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క భువనగిరి లోక్‌సభ స్థానంలోనే పోటీచేసిన...

- మిగతా 6వ పేజీలో...

తుట్టెలు కడుతున్న

రేషన్ బియ్యం

పట్టించుకోని అధికారులు

మోత్కూరు,అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి):రేషన్ దుకాణాల్లో బియ్యం పురుగు పట్టి తుట్టెలు కడుతోంది. ఆ బియ్యాన్నే పంపిణీచేస్తున్నారని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తుండగా, తుట్టెలు కట్టిన బియ్యాన్ని పక్కనబెట్టి మంచివాటినే ఇస్తున్నామని రేషన్ డీలర్లు చెబుతున్నారు.గతంలో మిగిలిన దొడ్డు బియ్యం, నెలనెలా మిగులుతున్న బియ్యం తుట్టెలు కట్టాయని రేషన్ డీలర్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటున్నారు.

ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. గత ఏప్రిల్‌లో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీని ప్రారంభించేనాటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణల్లో క్వింటాళ్ల కొద్దీ దొడ్డు బియ్యం నిల్వ ఉంది. రేషన్ డీలర్ల వద్ద నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వం తీసుకోవాల్సి ఉండగా, వాటిని అలానే రేషన్ దుకాణాల్లో ఉంచింది. రేషన్ దుకాణాల్లో ఆరు మాసాలుగా దొడ్డు బియ్యం నిల్వ ఉండటంతో అవి పురుగుపట్టి తుట్టెలు కట్టాయి.

స్టాక్ తగ్గించకపోవడంతో పెరుగుతున్న నిల్వలు

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక నెల రేషన్ దుకాణానికి కేటాయించిన బియ్యం పంపిణీ అనంతరం ఆ నెలలో ఎంత మిగిలిందన్న లెక్క డీలర్లు నుంచి తీసుకునే వారు. మరుసటి నెలలో ఆ దుకాణం కోటాలోంచి వారి వద్ద మిగిలిన బియ్యం మొత్తాన్ని తగ్గించి మిగతా కోటాను పంపేవారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతీ నెల రేషన్ దుకాణం పరిధిలో ఉన్న కార్డుదారుల సంఖ్యను బట్టి బియ్యం కోటాను రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తోంది. ప్రతీ నెల అందుబాటులో లేక కొందరు లబ్ధిదారులు బియ్యం తీసుకెళ్లకపోవడమనేది సహజం. పైగా ఇప్పుడు రేషన్ బియ్యాన్ని ఎక్కడ నుంచైనా తీసుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో బతుకుదెరువు కోసం పట్టణ ప్రాంతాల్లో ఉండే వారు రేషన్‌కార్డు గ్రామాల్లో ఉన్నా రేషన్ మాత్రం పట్టణాల్లో తీసుకుంటున్నారు. దీంతో రేషన్ డీలర్ల వద్ద ప్రతీ నెల కొంత బియ్యం మిగులుతోంది. మిగిలిన బియ్యం మరుసటి నెలలో తగ్గించకపోవడంతో నిల్వలు పెరుగుతున్నాయి.

ధర్మ పరిరక్షణకు కృషిచేయాలి

సుప్రీంకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎన్‌వీ.రమణ



చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న జస్టిస్ ఎన్‌వీ.రమణ

చింతపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ హిందూ ధర్మపరిరక్షణకు కృషి చేయాలని సుప్రీంకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎన్‌వీ.రమణ అన్నారు. శనివారం చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో సాయినాథుడి ఆయన దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, రెండో షిర్డీ క్షేత్రంగా చింతపల్లి సాయిసన్నిధి ప్రసిద్ధి చెందుతోందన్నారు. భక్తుల కోర్కెలు తీర్చే సాయినాథుడి దర్శించుకోవడం ద్వారా జీవితంలో కష్టాలు తొలగిపోతాయన్నారు. ఆలయ అభివృద్ధికి, హిందువుల పవిత్రను కాపాడేందుకు ఆలయంలో సుమారు 300 గోవులను పెంచడంతో పాటు, భక్తులకు నిత్య అన్నప్రసాద వితరణకు ఆలయ కమిటీ కృషిచేయడం అభినందనీయమన్నారు. జస్టిస్ ఎన్‌వీ.రమణకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, పూరె కృష్ణయ్య, గోశాల ఇన్‌చార్జి కుంభం పుల్లారెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌ను సందర్శించిన జస్టిస్ ఎన్‌వీ.రమణ

(ఆంధ్రజ్యోతి, నాగార్జునసాగర్): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ శనివారం సందర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థాన జాయింట్ ఎగ్జిక్యూటివ్ అధికారి వెంకయ్యచౌదరి తండ్రి చలమయ్య ఇటీవల మృతిచెందటంతో ఆంధ్రప్రదేశ్‌లోని బెల్లంకొండవారిపాలెంలో నిర్వహించిన పెద్దకర్మకు జస్టిస్ రమణ హాజరయ్యారు. శుక్రవారం రాత్రి సాగర్ విజయవిహార్ అతిథిగృహానికి చేరుకున్న జస్టిస్ రమణ శనివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య సలహాదారుడు శ్రీనివాసరాజుతో కలిసి సాగర్ ప్రధాన డ్యాం, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, నాగార్జునకొండను సందర్శించారు. పర్యాటకశాఖ గైడ్ సత్యనారాయణ ఆయనకు సాగర్ విశేషాలను వివరించారు. ఆయన వెంట తిరుమలగిరి తహసీల్దార్ అనిల్‌కుమార్, సాగర్ ఎస్ఐ ముత్తయ్య, ప్రాజెక్టు ఏఈ కృష్ణయ్య, ఎస్‌పీఎఫ్ ఆర్ఐ శ్రీనివాసరావు, దండ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులకు రాజకీయ సమాధే

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజులశ్రీనివాస్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో చక్రహరి రామరాజు, తదితరులు

నల్లగొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులకు రాజకీయ సమాధి తప్పదని, కోర్టులను అడ్డం పెట్టుకొని రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూస్తే రాష్ట్రంలో అగ్గి రాజేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్‌తో ఆమోదించాల్సిన బాధ్యత బీజేపీదేనని స్పష్టం చేశారు. రాష్ట్ర జనాభాలో 60శాతానికి పైగా ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, అయితే రెడ్డి జాగృతికి చెందిన కొంతమంది కోర్టులను అడ్డం పెట్టుకొని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లను అడ్డుకుంటే భవిష్యత్‌లో బీసీలంతా ఏకమై రాజకీయ సమాధి చేస్తారని హెచ్చరించారు. ఉన్న జనాభా కంటే 18శాతం రిజర్వేషన్లు తక్కువ చేసి 42శాతంతో బీసీలకు సరిపెట్టి స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినా, రెడ్డి జాగృతి హైకోర్టుకు వెళ్లడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 5శాతం ఉన్న రెడ్డి సామాజికవర్గం వారు 80ఏళ్లుగా 90శాతం పదవులు అనుభవిస్తూ బీసీలకు రావాల్సిన వాటాను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఈనెల 8న హైకోర్టులో బీసీ రిజర్వేషన్ కేసు ఉన్నందున, ఎన్నికలు ఉండవని, బీసీ రిజర్వేషన్ అమలు కాదంటూ కొంతమంది ప్రచారం చేయడం తగదన్నారు. 50శాతం సామాజిక రిజర్వేషన్లు దాటకూడదని ఎక్కడా లేదని, అగ్ర కులాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో 10శాతం రిజర్వేషన్ కల్పించిన నాడే 50శాతం సీలింగ్ పోయిందన్నారు. బీసీలకు రిజర్వేషన్ పెంచినప్పుడే 50శాతం సీలింగ్ గుర్తుకురావడం శోచనీయమన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల పెంపుపై అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. రెడ్డి జాగృతిపై రాజకీయ పార్టీల్లో ఉన్న రెడ్డిలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రెడ్డిలు ఎటువైపో తేల్చుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు కాసోజు విశ్వనాథం, నల్ల సోమ మల్లన్న, కేశబోయిన శంకర్ ముదిరాజ్, నకిరేకకంటి కాశయ్య గౌడ్, జెల్లా ఆదినారాయణ, వాడపల్లి సాయిబాబా, గోలి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం నల్లగొండ లయన్స్ క్లబ్ వారోత్సవాలను ఎన్జీ కళాశాల మైదానంలో ఆమె ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదో రకంగా మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. మానసిక ఒత్తిడి తగ్గాలంటే జీవన విధానం మార్చుకోవాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు సాధ్యమైనంత వరకు స్మార్ట్ ఫోన్‌ను పక్కన పెట్టాలన్నారు. నడక వల్ల ప్రశాంతత చేకూరుతుందని, ఒత్తిడి దూరమవుతుందన్నారు. మానసిక ఆరోగ్యంపై లయన్స్ క్లబ్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం ఎంతో ప్రయోజనకరమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రేపాల మదన్‌మోహన్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, మోహన్‌రావు, ప్రసాద్, సతీష్‌కుమార్, రామకృష్ణ, అశోక్‌రెడ్డి, రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి 'ప్రజావాణి' రద్దు

జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఈ నెల 6న నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిశాకే 'ప్రజావాణి' నిర్వహిస్తామని, ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

విషాదాంతాలు

- ఈతకు వెళ్లి ఇద్దరు ఇంటర్ విద్యార్థులు మృతి
- వాగులో పడి ప్రైవేట్ ఉద్యోగి
- వేర్వేరు ప్రమాదాల్లో వృద్ధుడు, ట్రాక్టర్ డ్రైవర్
- బైక్ కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో పలు విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో పూర్వ విద్యార్థులతో కలిసి ఈతకు వెళ్లిన ఇంటర్ విద్యార్థుల్లో ఇద్దరు మృతి చెందగా, సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలో వాగులో పడి మరో వ్యక్తి మృత్యువాత పడ్డాడు. అదేవిధంగా నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలో ద్విచక్రవాహనాలు ఢీకొని వద్దుడు, కట్టంగూరు మండలంలో ట్రాక్టర్ ట్రాలీ మీది నుంచి వెళ్లడంతో డ్రైవర్ మృతి చెందాడు. అదేవిధంగా తండ్రి ద్విచక్రవాహనం కొనివ్వలేదని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుండెపోటుతో ప్రైవేట్ ఉద్యోగి కొండమల్లేపల్లి మండలంలో మృతి చెందాడు. ఆయా సంఘటనలతో విషాదఛాయలు నెలకొన్నాయి. 6

ద్విచక్ర వాహనం కొనివ్వలేదని
విద్యార్థి ఆత్మహత్య


గణేష్(ఫైల్)

నూతనకల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం కొనివ్వలేదనే మనస్తాపంతో పాలిటెక్నిక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం రాత్రి సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం తాళ్లసింగారం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తాళ్లసింగారం గ్రామానికి చెందిన పల్స భిక్షం కల్లు గీత కార్మికుడు కాగా, ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి కుమారుడు దివ్యాంగుడు, రెండో కుమారుడు గణేష్(17) తిరుమలగిరిలో పాలిటెక్నిక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తనకు ద్విచక్ర వాహనం కొనివ్వాలని దసరా పండుగ రోజున గణేష్ తల్లిదండ్రులను కోరటంతో వారు అందుకు నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన గణేష్ రాత్రి సమయంలో ఇంటిలోని దూలానికి ఉరి వేసుకున్నాడు. శనివారం తెల్లవారుజామున తాత సత్తయ్య గదిలోకి వెళ్లి చూడగా గణేష్ దూలానికి ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. తండ్రి భిక్షం చుట్టూ పక్కల వారిని పిలిచి కిందికి దించగా అప్పటికే గణేష్ మృతి చెందాడు. మృతుడి తండ్రి భిక్షం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రావుల నాగరాజు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో విషాదాంతాలు

● సంపులో మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

నార్కట్‌పల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సెలవులు సరదాగా గడిపేందుకు వచ్చిన విద్యార్థులకు నీటి సంపు మృత్యుకుహరంగా మారింది. నీటి సంపులో ఈతకు వెళ్లి మునుగుతున్న స్నేహితుడిని కాపాడేందుకు వెళ్లిన ఘటనలో ఇద్దరూ మృతిచెందారు. శనివారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని జువ్విగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర్లబావి గ్రామ శివారులో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నార్కట్‌పల్లిలోని శ్రీ విద్యాపీఠ్ హైస్కూల్‌లో 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న సుమారు 14 మంది పూర్వ విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో ఇంటర్ చదువుతున్నారు. వేర్వేరు గ్రామాలకు చెందిన వీరంతా దసరా సెలవులు కావడంతో నార్కట్‌పల్లిలో కలుసుకున్నారు. ఆదివారం నాటితో సెలవులు ముగుస్తుండటంతో సరదాగా గడపాలని నిర్ణయించుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో ఒక విద్యార్థి తన స్నేహితుడికి తెలిసిన వెంకటేశ్వర్లబావి గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు. తమ వెంట భోజనాలు, కూల్ డ్రింక్స్‌ను తీసుకెళ్లారు. నార్కట్‌పల్లికి చెందిన నల్లగొండ నాగరాజు, స్వాతి దంపతుల పెద్ద కుమారుడు నల్లగొండ రిషిక్ (17), చౌటుప్పల్‌కు చెందిన పోలోజు హర్షవర్ధన్ (17)తో పాటు మరో విద్యార్థి కలిసి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న సంపు వద్ద ఈత కొట్టేందుకు దిగారు. హర్షవర్ధన్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతుండటం గమనించిన రిషిక్ అతడిని కాపాడే ప్రయత్నం చేశాడు. ఇద్దరూ నీటిలో మునిగిపోవటంతో సమీపంలో ఉండి గమనించిన మరో స్నేహితుడు వ్యవసాయ క్షేత్రంలో ఉన్న కాపలాదారుడికి చెప్పారు. 100 డయల్ ద్వారా సమాచారం అందుకున్న నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి కూడా సమాచారం ఇవ్వగా ఫైర్ సిబ్బంది వచ్చి సంపులో మునిగిన ఇద్దరు విద్యార్థుల మృతదేహాలను బయటకు తీశారు. రిషిక్, హర్షవర్ధన్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఘటనా స్థలాన్ని నార్కట్‌పల్లి సీఐ నాగరాజు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.


నల్లగొండ రిషిక్, హర్షవర్ధన్(ఫైల్‌ఫొటోలు), సంపు నుంచి మృతదేహాలను వెలికితీస్తున్న గజ ఈతగాళ్లు

చౌటుప్పల్‌లో విషాదఛాయలు

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో శనివారం ఇంటర్ విద్యార్థి ఈతకు వెళ్లి మృతి చెందిన సంఘటనతో యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. చౌటుప్పల్‌కు చెందిన ఆర్టిస్ట్ పోలోజు శ్రీనివాస్‌చారి- శ్రావణి దంపతుల పెద్దకుమారుడు హర్షవర్ధన్(17) వరంగల్ జిల్లా జనగాంలో ఇంటర్‌ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులలో ఇంటికి వచ్చిన హర్షవర్ధన్ స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు నార్కట్‌పల్లికి వెళ్లాడు. స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన హర్షవర్ధన్ మృత్యువాత పడ్డాడు. దీంతో అటు స్నేహితులు, ఇటు కుటుంబసభ్యులు, బంధువులు శోక సముద్రంలో మునిగిపోయారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి ప్రైవేట్ ఉద్యోగి


రాము (ఫైల్)

నూతనకల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు వ్యక్తి వాగులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలోని తాళ్ల సింగారం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తాళ్లసింగారం గ్రామానికి చెందిన గంజి రాము(41) సూర్యాపేటలో ఓ షాపింగ్ మాల్‌లో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. దసరా సందర్భంగా ఈ నెల 1న స్వగ్రామానికి వచ్చాడు. అదే రోజు సాయంత్రం ఆ గ్రామ శివారులో గల సమీపంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వాగు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి వాగులో పడిపోయాడు. శనివారం వాగులో మృతదేహం తేలడంతో గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రాముకు ఇంకా వివాహం కాలేదు. మృతుడి సోదరుడు సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రావుల నాగరాజు తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ టైర్ కింద పడి ఒకరు మృతి


నరేష్ (ఫైల్)

కట్టంగూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ ట్రాలీ టైరు కింద ప్రమాదవశాత్తుపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పరడ గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పరడ గ్రామానికి చెందిన కొండూరి నరేష్(26) కూలీ పనులతో పాటు గ్రామానికి చెందిన నిమ్మనగోటి భాస్కర్ ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంలోని ఓ రైతు పొలాన్ని హార్వెస్టర్‌తో కోస్తుండగా వరి ధాన్యాన్ని తరలించేందుకు నరేష్ ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. మధ్యాహ్నం హార్వెస్టర్ డ్రైవర్‌తో పాటు అక్కడ ఉన్న వారు భోజనం చేసేందుకు వెళ్లారు. నరేష్ విశ్రాంతి తీసుకునేందుకు ట్రాక్టర్ ట్రాలీ కింద పడుకున్నాడు. మరల వరికోత ప్రారంభం కావడంతో డ్రైవర్ ఎస్‌కే రహీం నరేష్ నడిపే ట్రాక్టర్ స్టార్ట్ చేసి ముందుకు కదిలించాడు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కింద పడుకున్న నరేష్ తలపై నుంచి ట్రాలీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శనివారం నరేష్ తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు రహీంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని వృద్ధుడు


సాయిలు(ఫైల్)

నాంపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. ఎస్ఐ లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నాంపల్లి మండలం తుంగపాడు గౌరారం గ్రామానికి చెందిన జల్ల సాయిలు(65) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయనకు నలుగురు కుమారులు, భార్య ఉన్నారు. శనివారం ఇంటి సామాగ్రి కోసం నాంపల్లికి కాలినడకన బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన బచ్చెనబోయి సాలయ్య ద్విచక్రవాహనంపై నాంపల్లి వైపు వెళ్తుండగా అడిగి వాహనం ఎక్కాడు. వడ్డెపల్లి వద్దకు చేరుకోగానే నాంపల్లి నుంచి మర్రిగూడ వైపు వెళుతున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో జల్ల సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనంపై వచ్చిన మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. సాయిలు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయిలు భార్య లాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాబాసాయిగూడెంలో నేత్రదానం


తండ్రి నేత్రాలను దానం చేస్తున్న టీచర్ సైదిరెడ్డి

కనగల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని బాబాసాయిగూడెం గ్రామానికి చెందిన వేమిరెడ్డి చెన్నారెడ్డి(85) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన అతడి కుమారుడు వేమిరెడ్డి సైదిరెడ్డి విషాదంలోనూ సామాజిక బాధ్యతతో వ్యవహరించారు. తండ్రి నేత్రాలను నల్లగొండ లయన్స్‌క్లబ్ వారికి దానం చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల పిచ్చయ్య మాట్లాడుతూ మరణానంతరం నేత్రదానం చేయటం ద్వారా కంటిచూపు లేని అంధులకు కంటి వెలుగును ప్రసాదించే అవకాశం ఉంటుందన్నారు. సైదిరెడ్డితో పాటు కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బోదనం సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి ఎర్రమాద అశోక్, సహాయ కార్యదర్శి వేముల సాయికుమార్, జీఎస్‌టీ కోఆర్డినేటర్ మండడి శంకర్‌రెడ్డి, టెక్నీషియన్ జానీ తదితరులు ఉన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన మానసిక దివ్యాంగుడు


తండ్రి అంతిమయాత్రలో మానసిక దివ్యాంగుడైన తనయుడు

మర్రిగూడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తండ్రి మృతి చెందడంతో మానసిక దివ్యాంగుడైన తనయుడు వీల్‌చైర్‌పై కూర్చొని తలకొరివి పెట్టడంతో కలచివేసింది. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల నర్సింహ(70) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయనకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు మల్లయ్య పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడు కాగా కదల్లేని, నిలబడలేని పరిస్థితి. తల్లిదండ్రులైన పాపమ్మ, నర్సింహల సాయంతోనే వీల్‌చైర్‌లోనే ఉండేవాడు. అతడి బాగోగులు మొత్తం తల్లిదండ్రులు చూసుకునేవారు. అయితే తండ్రి నర్సింహ మృతి చెందడం, తలకొరివి పెట్టడానికి మానసిక దివ్యాంగుడైన మల్లయ్య వీల్‌చైర్‌లోనే కూర్చుని తండ్రికి తలకొరివి పెట్టడం చూసిన వారంతా కంటతడి పెట్టారు. నర్సింహ కుటుంబానికి గ్రామానికి చెందిన వెంకటేష్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

హుజూర్‌నగర్‌లో మోటార్ దొంగల అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పొలాల వద్ద విద్యుత్‌మోటార్లను చోరీచేస్తున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ చరమంరాజు విలేకరుల సమావేశంలో వివరాలను వివరించారు. పట్టణంలోని కనకదుర్గ వీధికి చెందిన రైతు చలువాది నర్సింహారావు వేపలసింగారం రోడ్డులోని వ్యవసాయ భూమి వద్ద ఐదు హెచ్‌పీ మోటార్‌ను ఏర్పాటుచేసుకున్నారు. రెండురోజుల కిందట మోటార్‌ను చోరీకి గురికావడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. శనివారం ఉదయం ఎస్ఐ మోహన్ మఠంపల్లి రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారానికి చెందిన సంగిశెట్టి నరేష్, శ్రీరాముల నాగాచార్యులు వ్యాన్‌లో పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని పట్టుకుని విచారించగా నర్సింహారావు మోటారు చోరీ చేసినట్లు అంగీకరించారని సీఐ తెఎలిపారు. చోరీకి ఉపయోగించిన వ్యాన్ స్వాధీనం చేసుకుని నరేష్, నాగాచారిలను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ మోహన్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యాపేటలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

సూర్యాపేట క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విజయకాలనీలో తాళంవేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగిన విషయం శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు, పట్టణ ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం విజయకాలనీలో ఉంటున్న సయ్యద్ జుబేదా, సలీం దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి సెప్టెంబరు 28న బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. తిరిగి ఈ నెల 3న రాత్రి సూర్యాపేటకు చేరుకున్నారు. ఇంటి తాళం పగులగొట్టి ఉండడం, ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని గ్రహించారు. ఇంట్లో భద్రపరిచిన సుమారు రూ.2 లక్షలకుపైగా విలువ చేసే రెండు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితురాలు జుబేదా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

గుండెపోటుతో ప్రైవేట్ ఉద్యోగి మృతి


రావుల రవి(ఫైల్)

కొండమల్లేపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో గుండెపోటుతో ఓ ప్రైవేట్ ఉద్యోగి మృతి చెందాడు. ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపిన వివరాల ప్రకారం చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన రావుల రవి(26) కొండమల్లేపల్లిలోని కీర్తన గోల్డ్ ఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తూ భార్య శివానితో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలోనే సోదరి అనిత, భార్య శివానితో కలిసి ఆనందంగా పండుగను జరుపుకున్నాడు. ఆ తర్వాత భార్యను పుట్టింటికి, తన అక్కను దేవత్‌పల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై దింపి శుక్రవారం తన ఇంటి చేరుకుని మిద్దె మీద నిద్రించాడు. శనివారం భార్య ఫోన్ చేయగా స్పందించకపోవడంతో ఆమె స్వగ్రామానికి వచ్చి చూడగా విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు రవి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు

భువనగిరి టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన రాజమండ్రి బాలుడి కథ భువనగిరిలో సుఖాంతమైంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి సమీపం గోకవరం గ్రామానికి చెందిన దంపతుల తొమ్మిదేళ్ల కుమారుడు పాత దుస్తులు, చీపుళ్ల తదితర వస్తువులు విక్రయించే అమ్మమ్మ వెంట నెలకిందట సికింద్రాబాద్‌కు వచ్చాడు. ఈ క్రమంలో అమ్మమ్మ నుంచి తప్పిపోయిన మనుమడు అక్కడే వీధుల వెంట తిరిగాడు. సికింద్రాబాద్ స్టేషన్‌లో సెప్టెంబరు 30న రైలెక్కిన బాలుడు అదేరోజు యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు రైల్వేస్టేషన్‌లో దిగాడు. ప్లాట్‌ఫామ్‌పై వెళ్తున్న బాలుడిని చూసిన ఆలేరు పోలీసులు చైల్డ్‌లైన్‌కు సమాచారమిచ్చారు. దీంతో చైల్డ్‌లైన్ సభ్యులు స్పందించి బాలుడిని భువనగిరిలోని బాలల సంక్షేమ సమితి బెంచ్ ఎదుట ప్రవేశపెట్టి చైల్డ్‌కేర్ సెంటర్‌లో నివాసం కల్పించింది. బాలుడు తెలిపిన వివరాల ప్రకారం తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. తల్లి బంధువులతో కలిసి శనివారం భువనగిరికి వచ్చింది. దీంతో సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ సమక్షంలో బాలుడిని ఆమెకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు ఎర్ర శివరాజు, డీసీపీయూ సిబ్బంది పాల్గొన్నారు. అయితే అమ్మమ్మ జాడ తెలియరాలేదని కుటుంబసభ్యులు తెలిపారు.

పిడుగుపాటుకు గేదె మృతి

మద్దిరాల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం కుంటపల్లిలో శనివారం పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. రైతు బత్తిని సైదులు తెలిపిన వివరాల ప్రకారం తన గేదెను గ్రామశివారులో మేపుతుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు.

కేసు నమోదు

నార్కట్‌పల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇచ్చిన డబ్బులను అడిగిన వ్యక్తిపై ఓ వ్యక్తి దాడి చేశాడు. శుక్రవారం ఈ సంఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపారు. నార్కట్‌పల్లికి చెందిన పన్నాల రాంరెడ్డి మండలంలోని బీ.వెల్లెంలకు చెందిన గోపాల్ అనే పరిచయస్తుడికి కొంతనగదును అప్పుగా ఇచ్చాడు. నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో శుక్రవారం ఉదయం బీ.వెల్లెంలలోని గోపాల్ ఇంటికి వెళ్లి డబ్బులు అడిగాడు. ఈ విషయంలో వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో సంయమనం కోల్పోయిన గోపాల్ కత్తితో రాంరెడ్డిపై దాడి చేశాడు. గాయపడ్డ రాంరెడ్డి అక్కడి నుంచి తప్పించుకుని వచ్చి నార్కట్‌పల్లిలోని ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. గోపాల్‌పై రాంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం చొల్లేరులో పేకాడుతుండగా ఎస్‌వోటీ పోలీసుల దాడులు చేసి పట్టుకుని ఆరుగురిపై కేసు నమోదు చేశారు. సీఐ బొడ్డుపల్లి భాస్కర్ శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చొల్లేరు గ్రామంలో ఈ నెల 3న ఆరుగు బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతుండగా పక్కా సమాచారం మేరకు ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేసి రూ.3వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పొత్తులు పొడిచేనా...?

(5వ పేజీ తరువాయి)

ఆ పార్టీ, నల్లగొండ సహా మిగిలిన అన్ని ఎంపీ స్థానాల్లోనూ ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చింది. ఈ ఎన్నికల్లోనూ సోదర వామపక్షం సీపీఐతో కలిసి కాంగ్రెస్‌తో పొత్తుకు వెళ్లేందుకు ఆ పార్టీ జిల్లాల నాయకత్వాలు సమాలోచనలు చేస్తున్నాయి. శనివారం జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గంలోనూ దీనిపై చర్చించినట్లు తెలిసింది. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో సీపీఎం నాయకులతో కలిసి ఎన్నికల్లో పోటీచేసే అంశంపై చర్చలు ప్రారంభించినట్లు సమాచారం. తొలుత కలిసి పనిచేయాలనే నిర్ణయానికి వస్తే, తదనుగుణంగా సీట్లు, పదవులపై చర్చ మొదలవుతుందని భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లో సీపీఐతో పాటు, కాంగ్రెస్‌తో కలిసి వెళ్తే బలమున్న ప్రాంతాల్లో సీట్లు దక్కించుకోవడంతో పాటు, అవగాహన కుదిరితే ఆ తర్వాత సైతం నామినేటెడ్ పదవులు, కోఆప్షన్ పదవులు దక్కించుకోవడం ద్వారా పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవచ్చనే వ్యూహాన్ని సీపీఐ నేతలు అనుసరిస్తున్నట్లు తెలిసింది. పొత్తుల్లో సీట్లు పొంది గెలుపొందితే ఆయా ప్రాంతాల్లో సమస్యలపైనా ప్రభుత్వ వేదికలపై పోరాడేందుకు అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. ఈ నెల 6, 7న స్థానిక ఎన్నికల్లో పొత్తులు, అవగాహనలపై సీపీఎం అధికారిక నిర్ణయం వెలువడుతుందని భావిస్తున్నారు.

పొత్తులతో సంబంధం లేకుండా అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ దృష్టి

పొత్తులు కుదిరినా, కుదరకపోయినా ఎన్నికల్లో పోటీచేసేందుకు అన్ని స్థానాల నుంచి అభ్యర్థుల ఎంపిక కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రారంభించింది. ప్రతీ జడ్పీటీసీ స్థానానికి మూడు పేర్ల చొప్పున కొన్నిచోట్ల ఐదేసి పేర్లచొప్పున ఇప్పటికే పీసీసీకి జాబితాలు అందాయి. ఈనెల 8వ తేదీన ఆ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థులను ప్రకటిస్తుందని తెలిసింది. అదేవిధంగా డీసీసీల ఆధ్వర్యంలో ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులను, సర్పంచ్ అభ్యర్థులను ఖరారు చేయనున్నారు. జాబితాలు వెలువడేలోగా పొత్తులు, అవగాహనలపై స్పష్టత వస్తే ఆ మేరకు పార్టీ అభ్యర్థులను ఆయా స్థానాల్లో ప్రకటించకుండా నిలిపివేస్తారని తెలిసింది.

కదనరంగంలోకి బీఆర్ఎస్

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు సాధించిన బీఆర్ఎస్ ఈసారి రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని సీట్లలో అభ్యర్థులను నిలిపి సత్తాచాటాలని నిర్ణయించింది. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నేతృత్వంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ఇప్పటికే చర్చించగా,అభ్యర్థుల ఎంపిక నిమిత్తం మాజీ ఎమ్మెల్యేల అధ్యక్షతన అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో, మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. పోటీచేసే అభ్యర్థుల ఎంపికతో పాటు, ఈ ఎన్నికల్లో అనుసరించాల్సిన ప్రచారవ్యూహం,తీసుకోవాల్సిన ఎజెండాపై మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని జడ్పీటీసీ స్థానాలు, ఎంపీటీసీ స్థానాలతో పాటుగా, సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు బీఆర్ఎస్ అభ్యర్థులను నిలబెట్టి అధికారపార్టీకి సవాల్ విసరాలని బీఆర్ఎస్ వ్యూహంగా ఉంది.

అన్నిసీట్లలో పోటీకి సిద్ధమవుతున్న బీజేపీ

లోక్‌సభఎన్నికల ఒరవడిని కొనసాగించడం ద్వారా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌ను అన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో బలంగా ఢీకొట్టాలని బీజేపీ నిర్ణయించింది. ఆ మేరకు అభ్యర్థుల ఎంపికకు కసరత్తు ప్రారంభించింది. ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకోవడం తోపాటు, సర్వేలు నిర్వహించి అభ్యర్థులను ఎంపికచేయాలని నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాల్లోనూ రెండో స్థానంలో నిలిచిన బీజేపీ, ఈ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌తో తమ పార్టీకే పోటీ ఉంటుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ప్రధానంగా మాజీ సర్పంచ్‌లు, యువత, రైతాంగం వారికి అనుకూలంగా ఉందని, ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుతామని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

రిజర్వేషన్లతో నే'తల'రాతలు తారుమారు


ఆశావహుల నారాజ్..!

స్థానిక సంస్థలకు ఎన్నికల నేపథ్యంలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. అయితే ఈ కేటాయింపులు కొందరికి మోదం కలిగించగా మరికొందరికి ఖేదం మిగిల్చాయి. కొన్నిచోట్ల ఆయా స్థానాల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహులపై నీళ్లు చల్లాయి. తమ రాజకీయ జీవితంలో ఒక్కసారైనా ఎంపీటీసీ, సర్పంచ్ పదవిని దక్కించుకోవాలని ఇన్నాళ్లూ కలలు కన్న కొందరికి నిరాశను మిగిల్చాయి. అదే సమయంలో కొన్నేళ్లుగా పోటీ చేసే అవకాశం దక్కని వర్గాల వారికి ప్రస్తుత రిజర్వేషన్ల వల్ల అవకాశం రావడంతో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

స్థానికసంస్థలకు ఖరారుచేసిన రిజర్వేషన్లు నకిరేకల్ నియోజకవర్గంలోని మండల స్థాయి పదవులపై గంపెడాశలు పెట్టుకున్న నేతల్లో తీవ్ర అసంతృప్తిని మిగిల్చాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డుసభ్యుల స్థానాలకు రొటేషన్ పద్ధతిన రిజర్వేషన్లను ఎన్నికల సంఘం ఖరారు చేసింది. ఈ విధానమే కొందరు రాజకీయ నాయకుల ఆశలను అడియాసలు చేసింది. ఫలానా పదవికి ఇక వీళ్లే అనేంతగా అన్ని మండలాల్లో విస్తృత ప్రచారంలో ఉన్న మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే వీరేశంల ప్రధాన అనుచరులకు రిజర్వేషన్లు షాక్ ఇచ్చాయి. ఎంపీపీ, జడ్పీటీసీ పదవులు ఆశించిన జనరల్ సామాజిక వర్గానికి చెందిన నేతలకు అవి రాకపోయినా కనీసం సర్పంచ్‌గానో లేక ఎంపీటీసీ ఎన్నికవుదామంటే రిజర్వేషన్లు అవకాశం లేకుండా చేశాయి. దీంతో ఆశావహులైన నాయకులంతా 'నారాజ్'లో ఉన్నారు. పదేళ్లుగా ఎన్నో కష్టాలు, నష్టాలు అనుభవించి పార్టీకి, ప్రజలకు చేసిన తమమ సేవంతా బూడిదలో పోసిన పన్నీరైందని ఓ నేతలు ఆవేదన చెందుతున్నారు.

● నార్కట్‌పల్లి, రామన్నపేట, కట్టంగూరు, నకిరేకల్ జడ్పీటీసీ, ఎంపీపీ పదవులు ఎస్సీలకు కేటాయించారు. అయితే ఆయా ప్రధాన పదవులపై ఆశలు పెట్టుకున్న జనరల్, బీసీ నేతలకు ఇది అశనిపాతంలా మారాయి. దీంతో వారి ఆశలు ఆడియాసలయ్యాయి. అయితే రిజర్వేషన్లతో తమ ఆశలు గల్లంతైన నేతలందరూ ఎమ్మెల్యేను సంప్రదించగా తన చేతిలో ఏమీ లేదని ఇది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని చెప్పినట్లు తెలిసింది. అసంతృప్తిలో ఉన్న అనుచర నేతలకు ఎమ్మెల్యే నచ్చజెప్పినట్లు తెలిసింది.



వారికే సర్పంచ్ పదవి!

(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని సుత్తాన్‌పురంతండా, లాలితండాలను ఎన్నికల సంఘం బీసీ మహిళలకు రిజర్వు చేసింది. సుల్తాన్‌పురంతండాలో ఆరు వార్డులుండగా 176 కుటుంబాల్లో 392 మంది ఓటర్లు ఉన్నారు. సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వు చేశారు. మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన బీసీ వర్గానికి చెందిన షేక్ జానీ, సుభానా దంపతుల కుటుంబం 24ఏళ్ల ఈ గ్రామానికి వలస వచ్చి ఉంటోంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు పెళ్లి కావడంతో ముగ్గురులో సుభానా ఒక్కరే మహిళ మిగిలారు. ఈ గ్రామంలో రిజర్వేషన్ పరంగా ఆమెకు మాత్రమే పోటీ చేసే అర్హత ఉంది. దీంతో సదరు మహిళ ఏకగ్రీవంగా సర్పంచిగా ఎన్నికయ్యే అవకాశం ఉంది.

● లాలితండాలో పంచాయతీ పరిధిలో 182 కుటుంబాలు 423 ఓటర్లు ఉన్నారు. ఈ తండాను సైతం బీసీ మహిళకు కేటాయించారు. తండాలో ఒకే ఒక బీసీ వర్గానికి చెందిన తళ్లారి బ్రహ్మచారి, భార్య నాగమణి, కుమారుడు పవన్‌చారి కుటుంబం ఉంది. సర్పంచ్ పదవి బీసీ మహిళకు కేటాయించడం, గ్రామంలో నాగమణి మాత్రమే బీసీ మహిళ ఉండటంతో ఆమె ఏకగ్రీవంగా సర్పంచిగా ఎన్నికయ్యే అవకాశం ఉంది.

చింతపల్లి: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం తక్కళ్లపల్లి గ్రామంలో బీసీలకు ఓటర్లు అధికంగా ఉన్నప్పటికీ ఎస్టీకి రిజర్వు అయ్యింది. ఎస్టీ ఓటర్లు కేవలం 8 మంది మాత్రమే ఉన్నారు. దీంతో గ్రామంలో ఆశావహులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

అనుకూలించని రిజర్వేషన్లు

(ఆంధ్రజ్యోతి-కేతేపల్లి)

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలు, 16 గ్రామపంచాయతీలు, 160 వార్డులు ఉండగా ఇటీవల రిజర్వేషన్లు కేటాయించారు. జడ్పీటీసీ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వు కాగా మొత్తం 11ఎంపీటీసీ స్థానాల్లో 4 బీసీలకు, 4 ఎస్సీలకు కేటాయించగా, మరో మూడు జనరల్ స్థానాలుగా ఉన్నాయి. అలాగే 16 గ్రామపంచాయతీల్లో బీసీలకు 7, ఎస్సీలకు 4 కేటాయించగా మిగిలిన ఐదు పంచాయతీలుగా జనరల్ స్థానాలుగా ఉన్నాయి. అయితే ఎంపీటీసీగానో, సర్పంచ్‌గానో పోటీచేయాలనే లక్ష్యంతో ఇన్నాళ్లూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వస్తున్న నాయకులకు ఆయా స్థానాల రిజర్వేషన్లు అనుకూలించని పరిస్థితి నెలకొంది. జనాదరణ కలిగిన బీసీ, ఎస్సీ నాయకులు ఉన్న స్థానాలు జనరల్‌కు, బలమైన అగ్రవర్ణ నాయకులు ఉన్న స్థానాలు బీసీలు, ఎస్సీలకు రిజర్వు అయ్యాయి. దీంతో ఆయా స్థానాల్లో అన్ని రాజకీయ పార్టీలు కొత్త వారిని అభ్యర్థులుగా ఎంపిక చేయాల్సి ఉంది. ఈ క్రమంలో ఎస్సీ, బీసీ మహిళలకు కేటాయించిన స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేయడం రాజకీయ పార్టీల నాయకులకు తలకు మించిన భారంగా మారింది. ఎన్నికల్లో డబ్బు ప్రధానంగా మారడంతో ఆయా సామాజిక వర్గాల నుంచి మహిళా అభ్యర్థులు పోటీకి దిగడానికి జంకుతున్నారు. దీంతో పార్టీల నాయకుల దృష్టి తటస్థుల వైపు మళ్లింది.

దామన్నకు కన్నీటి వీడ్కోలు

● చివరి చూపుకోసం వేలాదిగా తరలివచ్చిన అభిమానులు ● నివాళులర్పించిన టీపీసీసీ చీఫ్, మంత్రులు, నాయకులు



దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం సూర్యాపేట జిల్లా మండలకేంద్రంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో అధికార లాంఛనాలతో నిర్వహించారు. ఆర్డీఆర్ తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి తండ్రి చితికి నిప్పటించారు. దామోదర్‌రెడ్డి భౌతికకాయాన్ని చివరిసారిగా చూడడానికి ప్రజలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో అభిమానులతో ఆ ప్రాంతం కిక్కిరిసింది. దామోదర్‌రెడ్డి భౌతికకాయంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ జెండా ఉంచి నివాళులర్పించారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు ప్రభుత్వం అధికార లాంఛనాలతో నిర్వహించారు. గౌరవార్థం పోలీసులు మూడు రౌండ్ల గాలిలో కాల్పులు జరిపారు. అనంతరం ఆర్డీఆర్ తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి తండ్రి చితికి నిప్పంటించారు.

మంత్రులు, ఎమ్మెల్యేల నివాళి

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విరెడ్డి, వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, చెవిటి వెంకన్నయాదవ్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకుడు, మాజీమంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, బూడిద బిక్షమయ్యగౌడ్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు, వరుణ్‌రాజు, సందీప్‌రెడ్డి, రామచంద్రయ్య, కళ్యాణ్ చందర్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్‌పవార్, ఎస్పీ కె. నర్సింహ పాల్గొన్నారు. సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో 200మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

తుంగతుర్తి జనసంద్రం

తమ అభిమాన నాయకుడిని కడసారి చూసేందుకు సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి జిల్లా, ఖమ్మం నుంచి దామోదర్‌రెడ్డి అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రజల సందర్శన అనంతరం భౌతికకాయాన్ని ఆయన వ్యవసాయ క్షేత్రానికి తరలించారు. ఇంటినుంచి దహన సంస్కారాలకు తీసుకెళ్లే సమయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ హనుమంతరావు, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం పాడె మోశారు.



రోదిస్తున్న మాజీ ఎంపీ వీహెచ్



నివాళులర్పిస్తున్న సూర్యాపేట కలెక్టర్



తులసి నీళ్లు పోస్తున్న మంత్రి ఉత్తమ్



సర్వోత్తమ్‌రెడ్డిని ఓదారుస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




గౌరవసూచకంగా గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు



అంత్యక్రియలకు హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

సాగర్‌కు తగ్గిన వరద

● 26 గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల



26 గేట్ల ద్వారా విడుదలవుతున్న సాగర్ ప్రాజెక్టు నీరు

నాగార్జునసాగర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువనుంచి వరద రాక తగ్గింది. ఈ నెల 1వ తేదీన 4,13,608 క్యూసెక్కులు, 3వ తేదీన 2,61,176క్యూసెక్కుల నీరు చేరగా, శనివారం 2,59,147 క్యూసెక్కుల నీరు సాగర్‌కు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా శనివారం సాయంత్రానికి 587.50అడుగులు (305.8030 టీఎంసీలు)గా నమోదైంది. నాగార్జునసాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 8,718 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,901 కూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 కూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300కూసెక్కులు, 26గేట్ల నుంచి 2,03,788 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 2,59,147 కూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువనుంచి అంతే మొత్తంలో నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా వస్తుంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో రోజుల తరబడి విస్తారంగా కురిసిన వర్షాలకు నిండిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల గేట్లు ఎత్తడంతో పది రోజుల క్రితం ఉగ్రరూపం దాల్చిన మూసీ క్రమంగా శాంతిస్తూ వచ్చింది. శుక్రవారం సాయంత్రానికి 3227.96 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శనివారం సాయంత్రానికి మరింత తగ్గి 2579.96 క్యూసెక్కులుగా నమోదైంది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రాజెక్టు నీటిమట్టాన్ని 643.70అడుగులు(4.12టీఎంసీలు) వద్ద నిలకడగా ఉంచుతున్న అధికారులు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను ప్రాజెక్టు 2, 8నెంబరు క్రస్టుగేట్లను 2అడుగుల మేర ఎత్తి 2601.37క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు మరో 529.65క్యూసెక్కుల నీటి విడుదలతో ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో సమానంగా మొత్తం 3178.37క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు.

ఆర్ఆర్ఆర్ నిర్వాసితుల ధర్నాను విజయవంతం చేయాలి

భువనగిరి రూరల్/చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్)లో భూములు కోల్పోతున్న నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి అలైన్‌మెంట్ మార్చాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో ఆర్ఆర్ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులతో కలిసి పరిశీలించారు. భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని ఈ నెల 6న సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు గడ్డం వెంకటేశ్, కొండ అశోక్, కృష్ణ, వెంకటేశ్, మల్లేశ్, రమేశ్, రాజు, చంద్రయ్య పాల్గొన్నారు. హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నా ను విజయవంతం చేయాలని గ్రామీణ భూ నిర్వాసితుల న్యాయ పరిరక్షణ సమితి కన్వీనర్ దబ్బిడి రామ్ గౌడ్ కోరారు. చౌటుప్పల్ లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూ నిర్వాసితుల డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించేంత వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని, ప్రాణాలు పోయినా సరే న్యాయం జరిగేంత వరకు ఊరు కునేది లేదని హెచ్చరించారు.

గట్టుప్పల్: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 6న హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట నిర్వహించే ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా గట్టుప్పల మండలం తేరట్‌పల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గట్టుప్పల, తేరట్‌పల్లి, నామాపురం, వెల్మకన్నె గ్రామాలలో కొన్ని వందల ఎకరాలు రైతుల పట్టా భూములు కోల్పోతున్నారని, ప్రధానంగా సన్న, చిన్న కారు రైతులే భూ నిర్వాసితులు అవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో



తేరట్‌పల్లిలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు బండా శ్రీశైలం

సిపిఎం జిల్లా కమిటి సభ్యులు చాపల మారయ్య, కర్నాటి మల్లేషం, మండల కమిటీ సభ్యులు కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, అచ్చిన శ్రీనివాస్, వల్లూరి శ్రీశైలం, పెద్దగాని నరసింహ, ఖమ్మం రాములమ్మ, విశ్వనాదం పాల్గొన్నారు.

మర్రిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ట్రిబుల్‌ఆర్ రోడ్డు కోసం ముందుగా ప్రకటించిన అలైన్‌మెంట్‌నే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ ట్రిబుల్‌ఆర్‌లో సరంపేట, వట్టిపల్లి, బీమనపల్లి, లెంకలపల్లి గ్రామాలకు చెందిన రైతులు భూములు కోల్పోయి నష్టపోతున్నార న్నారు. సమావేశంలో సలవోజు రామలింగాచారి, నీలకంఠ రాములు, కొట్టం యాదయ్య, ఏడుకొండ రాఘవేంద్ర, యాదయ్య, వెంకటయ్యలు పాల్గొన్నారు.

రేపు ఎంపికలు

నల్లగొండ స్పోర్ట్స్, మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 69వ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్ -14, అండర్ -17 బాలబాలికల బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు మిర్యాలగూడలోని ఎన్ఎస్‌పీ మైదానంలో ఈనెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డి.విమల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరిలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఆసక్తి గల బాక్సింగ్ క్రీడాకారులు హాజరయ్యే విధంగా చూడాలని కోరారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రాజాపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. కార్యాలయంలో ముగ్గురు ఉద్యోగులు లేకపోవడంతో ఆరాతీశారు. విధుల్లో లేరని వారికి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పల్లెలు వదిలి.. రాజధాని వైపు



బీబీనగర్ గూడూరు టోల్‌ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

● జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సెలవులకు స్వగ్రామాలకు వెళ్లిన నగరవాసులు రాజధానికి పయనమవడంతో జాతీయ రహదారులపై శనివారం వాహనాల రద్దీ నెలకొంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారి వాహనాలతో రద్దీగా మారింది. కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు శుక్రవారమే పల్లెల నుంచి నగరానికి చేరుకున్నారు. చౌటుప్పల్ మండలంలో 30కిలోమీటర్ల పొడవున ఉన్న హైవేపై ఉన్న క్రాసింగ్‌లు, జంక్షన్ల వద్ద పోలీసులు వాహనాలను నియంత్రించారు. చౌటుప్పల్ ఏసీపీ పి. మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐలు మన్మ థకుమార్, విజయ్ మోహన్‌ల ఆధ్వర్యంలో ట్రాఫిక్ ని యంత్రణకు చర్యలు తీసుకున్నారు. చౌటుప్పల్ మం డలం పంతంగి టోల్‌గేటువద్ద రద్దీ నెలకొంది. వాహ నాలు బారులు తీరడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిం ది. వేలాది వాహనాలు టోల్‌గేట్ మీదుగా హైదరా బాద్‌కు వెళ్లాయి. 16గేట్లకు గాను 10గేట్ల ద్వారా వాహ నాలను హైదరాబాద్ వైపు పంపించారు. సాధారణ రోజుల్లో 30వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుం డగా దసరా తిరుగు ప్రయాణంతో అదనంగా 80వేల వాహనాలు రాకపోకలు సాగించాయి.

కిలో మీటర్‌కు పైగా ట్రాఫిక్ జాం

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. సుమారు కిలో మీటరుకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. టోల్‌గేట్ల వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా టోల్ సిబ్బంది వాహనాలను క్రమబద్ధీకరిస్తున్నారు. మొత్తం 12టోల్ గేట్లకు హైదరాబాద్ వైపు ఉన్న 6గేట్లకు అదనంగా రెండు గేట్లను తెరిచి వాహనాలను పంపుతున్నారు. ఆదివారం వాహనాల రద్దీ మరింత పెరిగే అవకాశముందని టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపారు.

కేతేపల్లి: పండుగలకు గ్రామాలకు వచ్చిన వారు వాహనాల్లో శనివారం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో 65వ నంబర్ జాతీయ రహదారిపై రద్దీ పెరిగింది. మామూలు రోజుల్లోనే రద్దీగా ఉండే ఈ రహదారిపై విరామం లేకుండా వెళ్తున్న వాహనాలతో జాతీయ రహదారి వెంట గల మండలంలోని కొర్లపహాడ్, చీకటిగూడెం, కేతేపల్లి, ఉప్పలపహాడ్ గ్రామాల్లోని యూటర్న్‌ల వద్ద ప్రజలు, రైతులు, మేకల కాపరులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

తిరుగు పయనమైన వాహనదారులు

చిట్యాలరూరల్: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. హైదరాబాద్‌లో నివాసముంటూ దసరా పండుగకు స్వస్థలాలకు వెళ్లిన వారు తిరుగు పయనం కావడంతో రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. హైదరాబాద్‌కు వాహనాల్లో వెళ్లే వాహనదారులు ఒకేసారి వచ్చినట్లుగా రహదారి మీద ప్రయాణాన్ని కొనసాగించడంతో రహదారిపై వాహనాలు బారులుదీరాయి. సెలవులను ముగించుకుని హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో నివసించే వారు వారివారి స్వస్థలాలకు కార్లలో, పలు వాహనాల్లో వెళ్లారు. ఒకేసారి జాతీయ రహదారిపై వెళ్తుండడంతో వాహనాలతో రహదారి రద్దీగా మారింది.

యూరియా కోసం రైతుల ఆందోళన



మఠంపల్లిలో నినాదాలు చేస్తున్న రైతులు

మఠంపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతుల తిప్పలు తప్పడం లేదు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి సహకార సంఘంతో పాటు సబ్ సెంటర్ల గ్రామాలైన రఘునాథపాలెం, భీల్యానాయక్‌తండా, చౌటపల్లి, పెదవీడులో శనివారం యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరిసాగు చేయడంలో పలు రకాలుగా ఇబ్బందులు పడుతుంటే వరి పెరుగుదలకు కావాల్సిన యూరియా కోసం రాత్రింబవళ్లు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు. మఠంపల్లి సహకార సంఘంలో రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని కోరుతూ అన్నదాతలు శనివారం మండల సహకార వ్యవసాయ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సహకార సంఘం అధికారులు తమకు నచ్చిన గ్రామాలకు యూరియా సరఫరా చేస్తున్నారని, దొనబండతండా, కాల్వపల్లితండా, పాతతండా రైతులకు యూరియా సరఫరా చేయడం లేదన్నారు. కొన్ని రోజులుగా మఠంపల్లి పరిసరా ప్రాంత రైతులకు పీఏసీఎస్, మన గ్రోమోర్ సెంటర్లలో సరిపడా యూరియా దొరక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.

సానుభూతి రాజకీయాలకు అవకాశం ఇవ్వొద్దు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సానుభూతి రాజకీయాలకు ఓటర్లు అవకాశం ఇవ్వకుండా ప్రజాస్వామ్య బద్ధంగా తమ ఓటు హక్కును వినియోగించుకోని వారసత్వ రాచరిక రాజకీయాలకు స్వస్తి చెప్పాలని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు పదవీకాలం మధ్యలో చనిపోయినప్పుడు అన్నిరాజకీయ పార్టీలు సానుభూతి ఓట్లను కొల్లగొట్టేందుకు ప్రజాస్వామ్య పద్ధతికి వ్యతిరేకంగా వ్యవహరించి సానుభూతి ఓట్ల కోసం పాకులాడుతున్నాయన్నారు. ఈ పద్ధతిని మార్చేందుకు ప్రజల నుంచే మార్పు మొదలవ్వాలని కోరారు. నేటి రాజకీయాలన్నీ ప్రలోబ చర్యలతో సాగుతూ ప్రజల ఆలోచన శక్తిని దెబ్బతీస్తున్నాయన్నారు. దీని ఫలి తంగా ప్రజాసేవకు అంకితమైన వారంతా డబ్బుప్రవాహంలో కొట్టుకపోతున్నారన్నారు. మధ్యంతర ఉప ఎన్నికల్లో కాసింత ప్రజాధారణ నాయకులకు ప్రాధాన్యతన తగ్గి పదవీకాలం మధ్యలో మృతిచెందిన కుటుంబాల నుంచే ప్రజాప్రతినిధులు వస్తున్నారన్నారు. ఈ అనవాయితీ కొన్నేళ్లుగా కొనసాగుతుండగా, సానుభూతి ఓట్ల కోసం ప్రధాన రాజకీయ పక్షాల వెంపర్లాట కొనసాగుతూనే ఉందన్నారు. త్వరలో జూబ్లీహిల్స్‌లో జరిగే ఉప ఎన్నికలో ఆ ప్రాంత ఓటర్ల కొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధపడాలని కోరారు. వారసత్వం అనేది కుంటుబాలకే పరిమితమని, రాజకీయల్లో దానికి చోటుకల్పిస్తే రాజరికపాలనతో సమానమన్నారు. సమావేశంలో కామాల హరీష్, ఇంద్రపల్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గుట్టలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వినాయకచవితి, దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు, దసరా వేడుకల సందర్భంగా భక్తుల రద్దీ తగ్గుముఖం పట్టగా, శనివారం ఇష్టదైవాల దర్శనార్థం సుమారు 36 వేల మంది భక్తులు తరలివచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధానాలయం, కల్యాణోత్సవ మండపం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద రద్దీ నెలకొంది. స్వామిని ఆధ్యాత్మిక గురువు రాధా మనోహర్‌దాస్ దర్శించు కున్నారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 41,31,970ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

వలస కూలీలపై నిఘా

● గత సంఘటనలతో పోలీసులు అప్రమత్తం ● యజమానుల వద్ద కూలీల వివరాలు తప్పనిసరి ● సమాచార సేకరణకు సిద్ధం



యాదగిరిగుట్ట పట్టణంలో ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణం పనులు చేస్తున్న ఒడిషా కూలీలు

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 4,(ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాల నుంచి ఇతర రాష్ట్రాల కూలీలు వలస వస్తుంటారు. కొందరి వద్ద ఎలాంటి గుర్తింపుకార్డులు లేకపోవడంతో వారి సమాచారం తెలుసుకోవడం కష్టంగా మారుతోంది. ఎలాంటి వారో తెలుసుకొనే అవకాశం లేకుండాపోతోంది. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట డివిజన్ పరిధిలో బీహార్, ఒడిషా, యూపీ, ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వలస వస్తుంటారు. వారంతా భవన నిర్మాణం, ఇటుక బట్టీలు, చిరు వ్యాపారులు, లాడ్జిల్లో కూలీలు, హోటళ్లు, కిరాణ దుకాణాలు, కోళ్లఫామ్స్, సెక్యూరిటీ గార్డులుగా, వ్యవసాయ కూలీలుగా పని చేస్తుంటారు. ఇందులో కొంతమందికి ఆధార్, ఓటర్‌ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, నివాస ధ్రువీకరణ పత్రాలు లేకుండా పని చేస్తున్నారని తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి పని ఇప్పించేందుకు రప్పించిన యజమానుల వద్ద కూలీల పూర్తివివరాలు ఉండాలి. కానీ అలాంటి సమాచారం లేకపోవడంతో పోలీసులకు అనుమానాలు తలెత్తున్నాయి. దీంతో నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. వివిధ చోట్ల పనిచేస్తున్న వలస కూలీల సమాచార సేకరణకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా వారికి సంబంధించిన గుర్తింపుకార్డులను పరిశీలిస్తున్నారు. కూలీలకు గత నేర చరిత్ర ఉంటే ప్రమాదకరమని భావిస్తున్నారు. గతంలో ప్రజలను నమ్మించి కోట్ల రూపాయలు దండుకొని పారిపోయిన సంఘటనలు ఉండడంతో ముందుగానే పోలీసులు అప్రమత్తమవుతున్నారు. వలస వచ్చే ప్రతి కూలీ వద్ద గుర్తింపుకార్డులు ఉండాల్సిందేనని పోలీసులు తేల్చిచెబుతున్నారు. పలు రంగాల్లో పనులు చేయించడానికి ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించే యజమానులు వారి నుంచి తప్పనిసరిగా గుర్తింపు కార్డులు సేకరించాలని, వారి వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్లలో నమోదు చేయించాలని సూచిస్తున్నారు. ఇందుకు పూర్తి బాధ్యత కూలీలను తీసుకొచ్చే యజమాలదేనని పేర్కొంటున్నారు. అనుకోని సంఘటనలు జరిగితే యజమానులే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని ముందుగానే అప్రమత్తం చేస్తున్నారు.

గుర్తింపుకార్డులు లేనివారితో నిజమైన కూలీలకు ఇబ్బందులు



పొట్టకూటి కోసం పని చేసుకోవడానికి ఇక్కడికి వచ్చాం. కొంతమంది గుర్తింపుకార్డులు లేకుంటే నిజమైన మాలాంటి కూలీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుర్తింపుకార్డులు లేనివారిపై చర్యలు తీసుకొని, నిజమైన వారికి బతుకుదెరువు చూపించాలి.

● రమేష్ కూలీ, ఒడిషా.

వలస కూలీలు గుర్తింపుకార్డులు ఉంచుకోవాలి



పొరుగు రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చేవారు తప్పని సరిగా గుర్తింపుకార్డులు ఉంచుకోవాలి. గుర్తింపు కార్డులు లేకుంటే చర్యలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాల్లో నేరచరిత్ర కలిగిన వారు ఈ ప్రాంతంలో తలదాచుకునే అవకాశం ఉంటుంది. కూలీలను తీసుకొచ్చిన కాంట్రాక్టర్లు, యజమానులు కూలీల వద్ద గుర్తింపుకార్డులు తప్పనిసరిగా సేకరించాలి. వారి వివరాలు పోలీస్ స్టేషన్లలో నమోదు చేయించాల్సిందే. ఇప్పటివరకు డివిజన్ వ్యాప్తంగా సుమారు 500 మంది వలస కార్మికుల వివరాలు నమోదు చేశాం.

● శ్రీనివాస్‌నాయుడు, ఏసీపీ యాదగిరిగుట్ట.



శ్రీశైలం బోర్డు సభ్యుడిగా కాశీనాథ్

మునుగోడు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు చిలువేరు కాశీనాథ్ శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యుడిగా శనివారం నియమితులయ్యారు. దేవరకొండకు చెందిన ఆయన టీడీపీ నుంచి ఆ గ్రామ మాజీ సర్పంచ్‌గా, మునుగోడు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జితో పాటు పార్టీలో వివిధ హోదాలో పదవి బాధ్యతలు చేపట్టారు. ఆయన నియామకంపై పలు హర్షం వ్యక్తం చేశారు.

గ్రూప్-1 విజేతకు సన్మానం

చండూరు, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గీతా విద్యాలయం పూర్వ విద్యార్థి పాల్వాయి రాకేష్‌రెడ్డి గ్రూప్-1లో ఉద్యోగం సాధించాడు. ప్రతిభ కనబరిచారు. దీంతో పాఠశాల యాజమాన్యం శనివారం ఆయన సన్మానించింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ పోలోజు నర్సింహచారి, ఉపాధ్యాయులు కిరణ్, శౌకత్‌అలీ, ఆంజనేయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'డబుల్' కబ్జా

- ఔరవాణి డబుల్ బెడ్ రూంలలో అనధికార నివాసం..!
- ఆక్రమించుకున్న కొందరు గ్రామస్థులు
- అర్హులను ఎంపిక చేయలేదని ఆరోపణ

నార్కట్‌పల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ఔరవాణి గ్రామంలో డబుల్ బెడ్రూంలలో కొందరు గ్రామస్థులు అనధికారిక నివాసంగా మార్చుకున్నారు. డబుల్ బెడ్రూం మంజూరు కోసం 20 రోజుల క్రితం ఎంపీడీవో నుంచి పంచాయతీ కార్యదర్శికి పరిశీలన నిమిత్తం వచ్చిన డీబీఆర్ లబ్ధిదారుల జాబితాలో పేరు లేదని ఆరోపిస్తూ కొందరు గ్రామస్థులు డబుల్ బెడ్రూంలను అనధికారికంగా ఆక్రమించుకున్నారు. వారం రోజుల క్రితమే డబుల్ బెడ్రూంలోకి చేరి నివాసముంటున్నారు. అయితే ఈ డబుల్ బెడ్రూం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో పొద్దస్తమానం ఉంటూ సాయంత్రానికి తాళాలు వేసి వారి ఇళ్లకు వెళ్తున్నారు. అన్నిఅర్హతలు ఉన్నాడబుల్ బెడ్రూం లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోవడంతో మేమే స్వయంగా డబుల్ బెడ్రూంలను ఆక్రమించుకున్నామని వారు చెబుతున్నారు. ఇప్పటికే ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఉన్నవారిని అర్హత లేని వారిని డీబీఆర్ లబ్ధిదారులుగా గుర్తించారని వారు ఆరోపిస్తున్నారు.



అంతర్గత రోడ్ల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలు

80 డబుల్ బెడ్రూంలు...

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఔరవాణి గ్రామంలో అప్పటి,ఇప్పటి ఎమ్మెల్యే వేముల వీరేశం హయాంలోనే 80డబుల్ బెడ్రూంలను మంజూరు చేశారు. ఒక్కో బ్లాక్‌లో 8 ఇళ్ల చొప్పున మొత్తం 10 బ్లాక్‌ల్లో 80 ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. అయితే వీటి నిర్మాణ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ కరోనా సమయంలో మృతి చెందాడు. దీనికి తోడు బిల్లులు కూడా సకాలంలో రాకపోవడంతో బిల్డింగ్‌లో కరెంటు, నీటి సరఫరా పనులను పూర్తి చేయలేదు. రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించలేదు. దీంతో అవి ప్రారంభానికి నోచుకోక కొన్నేళ్లుగా నిరర్థకంగా మారాయి. అయితే మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఈ డబుల్ బెడ్రూంల కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సంపులు నిర్మాణం కోసం రూ.56.45లక్షల అంచనాతో పనులు చేపట్టారు. అవి పూర్తయ్యే దశలో ఉన్నాయి. కానీ డబుల్ బెడ్రూంల భవనాల మధ్య అంతర్గత రోడ్లను మాత్రం సీసీ రోడ్లుగా మార్చేందుకు నిధులు మంజూరు చేయలేదు.



ఔరవాణిలోని డబుల్ బెడ్రూం ఇళ్లు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

లబ్ధిదారులను గుర్తించి పంపిణీ చేయకపోవడం, నిర్వహణ, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ డబుల్ బెడ్రూంలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నిర్జన ప్రదేశంగా ఉండే ఈ గదుల్లోకి వచ్చి మద్యం తాగడం, సిగరెట్లు, గుట్కా ఇతర మత్తు పదార్థాలను తాగుతూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా వీటిని చేసుకున్నారని ఆరోపిస్తున్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి



డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ఎంపిక పూర్తిస్థాయిలో పారదర్శకంగా చేపట్టాలి. రాజకీయాలకతీతంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఎంపిక చేయాలి. అనర్హులకు డీబీఆర్‌లో ఇళ్ల మంజూరు చేశారనే ఆగ్రహంతోనే అర్హత ఉన్న కొందరు బాధిత గ్రామస్థులు డబుల్ బెడ్రూంలను ఆక్రమించుకుని అనధికార నివాసం చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసుకుని పరిశీలించి లబ్ధిదారులను ఎంపికచేస్తే మేం పూర్తిగా సహకరిస్తాం. లేదంటే గ్రామస్థుల తరపున ఆందోళన చేస్తాం.

- కల్లూరి కంతమహేశ్వర్, సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి

డీబీఆర్ లబ్ధిదారుల ఎంపిక చేయలేదు



ఔరవాణిలో డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ఎంపిక అధికారికంగా జరగలేదు. లబ్ధిదారుల జాబితా ఎంపిక పరిశీలనలో ఉందన్న ప్రచారం అవాస్తవం. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల్లో అర్హత ఉన్నా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కాని వారిని గుర్తించేందుకు పంచాయతీ కార్యదర్శి ద్వారా జాబితాను పరిశీలించామే తప్ప అది డీబీఆర్ లబ్ధిదారుల జాబితా కాదు. డీబీఆర్ లబ్ధిదారుల జాబితాలో తమ పేరు లేదని అనధికారికంగా డీబీఆర్‌లను ఆక్రమించుకుని ఉండటం సరైంది కాదు. వెంటనే సదరు గ్రామస్థులు డీబీఆర్ ఇళ్లను ఖాళీ చేయాలి. లేదంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

- ఉమేష్‌చారి, ఎంపీడీవో నార్కట్‌పల్లి

ఆర్డీఆర్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు



శాలిగౌరారం: దామోదర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

శాలిగౌరారం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఫ్లెక్సీకి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, జిల్లా అభివృద్ధి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, నాయకులు భూపతి వెంకన్న, పెరుమాండ్ల నరేష్, నూనె కోటి, బొల్లికొండ గణేష్, షేక్ ఇబ్రహీం, నిమ్మల క్రిష్ణ, దాసయ్య, లతీఫ్‌సాబ్, సత్తయ్య పాల్గొన్నారు.

చిట్యాలరూరల్ : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి చిట్యాల మండలం పెద్దకాపర్తి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించారు. తుంగతుర్తిలో జరిగిన దామోదర్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ళ శిశుపాల్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రిగా ఆయన రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని రైతుల అభ్యున్నతికి పాటుపడ్డారని కొనాయాడారు. ఆయన అకాల మరణం పార్టీకి తరనిలోటని ఆయన ఆత్మశాంతించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి, నూతి తిరుమలేష్, ఏర్పుల వెంకటేష్, మైల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

● ***మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి***

నల్లగొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలన్నింటినీ గెలుచుకుని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి కోరారు. శనివారం జిల్లా కేం ద్రంలోని క్యాంపు కార్యాలయంలో కనగల్ మండల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాల ప్రస్తావన లేకుండా బీఆర్ఎస్ పార్టీ పోటీచేసిన అన్ని స్థానాల్లోనూ గెలవాలన్నారు. కనగల్ మండలంలో 24 గ్రామపంచాయతీలో, 9ఎంపీటీసీ స్థానాలు, ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. పార్టీ అభ్యర్థులుగా ప్రకటించిన వారందరి విజయం కోసం కష్టపడి పనిచేయాలన్నారు. కార్యకర్తల కోసం తాను ఎంత వరకు అయినా పోరాటానికి సిద్ధమని, సాధ్యమైనంత వరకు యువకులను అభ్యర్థులుగా ఎంపిక చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు కటికం సత్తయ్యగౌడ్, ఖరీంపాషా, రవీందర్‌రావు, యాదయ్య, శ్రీధర్‌రావు, శేఖర్‌రెడ్డి, కృష్ణయ్య, హనుమంత్, నర్సిరెడ్డి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

స్థానిక ఎన్నికల్లో
బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

● ***బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి***

నల్లగొండ రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకత ఉందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని బీజేపీ విజయం కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మోసపు మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు నెరవేర్చలేక ప్రజలను మభ్యపెట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతగానితనం వల్ల రైతులకు యూరియా కొరత ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత వల్ల 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు వెనక్కి వెళ్లాయన్నారు. గ్రామాలకు కేంద్రం నుంచి మాత్రమే నిధులు రావడంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.కల్యాణ్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి తూటుపల్లి రవి కుమార్, గోలి మధుసూదన్ రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, మాదగోని శ్రీనివాస్ గౌడ్, కన్మంతరెడ్డి శ్రీదేవి రెడ్డి, బండారు ప్రసాద్, పిల్లి రామరాజు, దోనూరు వీరారెడ్డి, సాధినేని శ్రీనివాస్, నకిరేకంటి మొగిలయ్య, పోతెపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, సజ్జల నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గీత కార్మికునికి
మొబైల్ కిట్టు, మోటారు సైకిల్ ఇవ్వాలి



కొప్పు శ్రవణ్



కల్లూరి కంఠ మహేశ్వర్

నార్కట్‌పల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గీత కార్మికునికి మొబైల్ కిట్టు, మోటార్ సైకిల్ ఇవ్వాలని గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామనుగుండ్ల అచ్చాలు డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గీత కార్మికుల సంక్షేమం, సమగ్రమైన చట్టాలు రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.12.60కోట్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతీ గీత కార్మికునికి పింఛన్ ఇవ్వాలని, గీత కార్మిక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి కార్మికులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కల్లుగీత కార్మిక సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పు శ్రవణ్, ఉపాధ్యక్షులు అంతటి సత్యనారాయణ, పుల్లెంల లింగయ్య, ముద్దం అంజయ్య, నిమ్మరకోటి ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి కల్లూరి కంఠమహేశ్వర్, సహాయ కార్యదర్శులుగా మాదగోని సైదులు, ఉదతల శ్రీనివాస్, బస్తాల రాములు, బొడిగె నర్సింహులతో పాటు 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నర్సింహ, గోపగోని శ్రవణ్, శివ పాల్గొన్నారు.



నల్లగొండ పట్టణంలోని రామకోటి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహానికి నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆధునిక సేవలు

- ● వ్యవసాయ రుణాలపై రైతులకు 9శాతంతో రుణాలు
- ● ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై అత్యధిక వడ్డీ
- ● రూ. 2వేలకే రూ. 40లక్షల బీమా సౌకర్యం వర్తింపు
- ● తెలంగాణ బ్యాంకు చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి

చిట్యాలరూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికనుగుణంగా ఖాతాదారులకు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆధునిక సేవలను అందుబాటులో ఉన్నాయని తెలంగాణ బ్యాంకు చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడులో తెలంగాణ గ్రామీణ బ్యాంకును నూతన భవనంలోకి మార్చగా శనివారం చైర్మన్ కె. ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం బ్యాంకులో పూజాకార్యక్రమం నిర్వహించి పలు గదులను ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అన్ని వాణిజ్య బ్యాంకులకు దీటుగా తమ బ్యాంకులో ఖాతాదారులకు ఆధునిక డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అంతే కాకుండా నూతనంగా తమ బ్యాంకు ఖాతాదారులకే కాకుండా చిన్నచిన్న వ్యాపారలస్తుకు ఉపయోగపడే విధంగా క్యూఆర్‌కోడ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. వ్యవసాయ అనుబంధ రుణాలను సులభతరంగా అందిస్తామని ప్రత్యేకంగా వ్యవసాయ పరికరాల కోసం రైతులు తీసుకున్న రుణాలకు కేంద్ర ప్రభుత్వం 3శాతం రాయితీనందిస్తోందని దీంతో రైతులకు 9శాతానికే వ్యవసాయ పరికరాలపై తక్కువ వడ్డీకే రుణాలు లభిస్తాయన్నారు. వ్యవసాయాన్ని, మహిళా సంఘాలను ప్రోత్సహించేందుకు తమ బ్యాంకు ముందుంటుందన్నారు. ఎవరైనా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించినట్లయితే అలాంటి వారిని ప్రోత్సహించేలా మరోమారు రునాలను అందింస్తామన్నారు. ప్రమాదబీమా సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని రూ. 2వేలు చెల్లించినట్లయితే రూ. 40లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందని పలు బీమా ప్రయోజనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాపార, వాణిజ్య రుణాలను కూడా ఇస్తామని బ్యాంకు అభివృద్ధిలో ఖాతాదదారులు, రుణగ్రహీత లే కీలమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా తమ బ్యాంకు ఉన్నతమైన సేవలందిస్తోందని, నాణ్యమైన సేవలందించడం తమ కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఆశాలత, చీఫ్, హబ్ మేనేజర్లు సుదీష్, అన్వేష్, సీనియర్ మేనేజర్ మురళీకృష్ణ, స్థానిక శాఖ మేనేజర్ ఆర్‌పీఆర్ సరోజ, ఫీల్డ్ ఆఫీసర్ శిరీష, క్యాషియర్ శారద, సిబ్బంది సైదులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



ఖాతాదారులతో మాట్లాడుతున్న చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి

రోడ్డెక్కిన వ్యాపారం.. ట్రాఫిక్‌తో సతమతం

- ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ● పట్టించుకోని అధికారులు

చండూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): చండూరు మునిసిపాలిటీ ప్రణాళికా విభాగం అధికారుల నిర్లక్ష్యం వెరసి కొందరు వ్యాపారులు యథేచ్ఛగా రహదారులను ఆక్రమించి దుకాణాలు నిర్మిస్తున్నారు. రహదారిపై ఇరువైపులా ఏర్పాటు చేసిన నడకదారిని కొందరు వ్యాపారులు ఆక్రమించారు. గుండ్రాంపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద జడ్పీ హైస్కూల్ ప్రహరీ ఆనుకుని ప్రధాన రహదారి వెంబడి కొందరు డబ్బాలను ఏర్పాటు చేసుకున్నారు. హైదరాబాద్ రోడ్డులో ఓ ప్రైవేట్ హాస్పిటల్, హోటల్స్ యజమానులు, తెలంగాణ తల్లి విగ్రహం పక్కన కొంతమంది వ్యాపారులు సిమెంట్ కట్టడాలు, రేకులతో షెడ్డులను వేసుకుని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నా మునిసిపాలిటీ అధికారులు అడ్డుకోలేకపోతున్నారు. ప్రధాన రహదారిపై ఉన్న కాలిబాటపై తోపుడుబండ్లు ఏర్పాటు చేయడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటి వద్ద కొనుగోలు చేసేందుకు వినియోగదారులు తమ వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. దీని కారణంగా రహదారిలో వాహనాలకు అసౌకర్యంగా మారుతుంది. అధికారులు ఆక్రమణలను గుర్తించి తొలగిస్తుంటే కొందరు మాజీ ప్రజా ప్రతినిధులు, రాజకీయ జోక్యంతో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు.



జడ్పీ హైస్కూల్ పక్కన అక్రమ నిర్మాణాలు



బస్టాండ్ ఎదుట నడకదారిని ఆక్రమించిన దుకాణదారులు

ఈ విషయంపై కమిషనర్ మల్లేశం వివరణ కోరగా తాము అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. ఇప్పటికే కొన్ని అక్రమ నిర్మాణాలను తొలగించామని, ప్రణాళిక సిబ్బందిని పంపి మరికొన్ని ఆక్రమణకు గురైన రోడ్లను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పట్టణ అభివృద్ధికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

ఆదివారం 5 అక్టోబరు 2025

గరిష్ఠం 31.0
కనిష్ఠం 23.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.8030)	2,59,147	2,59,147
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	2,579.96	3,178.37
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.422 (40.3981)	1,96,031	1,85,403

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

పట్నానికి తిరుగుప్రయాణం



దసరాకు పల్లెలకు వెళ్లిన నగరం వాసులు తిరుగుప్రయాణమయ్యారు. వాహనాల్లో బయల్దేరడంతో జాతీయ రహదారులపై రద్దీ ఏర్పడింది. టోల్‌ప్లాజాల వద్ద సైతం వాహనాలు నెమ్మదిగా కదలడంతో కొంత ట్రాఫిక్‌జాం అయింది. 7

గుట్టలో భక్తుల రద్దీ



దసరా సెలవులు ముగిసినా యాదగిరిగుట్ట ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో నృసింహుడిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. 7

సాగర్‌లో పర్యాటక రద్దీ



ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. దసరా సెలవులు ముగుస్తుండటం, వారాంతం కావడంతో సాగర్ 26 క్రస్ట్‌గేట్లను తెరిచి ఉండటంతో కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో సాగర్‌కు తరలివచ్చారు.



నివాళులర్పిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, తదితరులు

దామన్నకు కన్నీటి వీడ్కోలు



- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి
- భారీగా తరలివచ్చిన అభిమానులు 7

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో అధికార లాంఛనాలతో నిర్వహించారు. అంత్యక్రియల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఆర్డీఆర్ చితికి తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి నిప్పంటించారు. దామోదర్‌రెడ్డి భౌతికకాయాన్ని చివరిసారిగా చూసేందుకు ప్రజలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

సాగర్‌కు తగ్గిన వరద

26 గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల 7

సానుభూతి రాజకీయాలకు అవకాశం ఇవ్వొద్దు

వేనేపల్లి పాండురంగారావు



పొత్తులు పొడిచేనా?

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు ముహూర్తం దగ్గరపడుతుండటంతో రాజకీయపార్టీల పొత్తులపై కసరత్తు మొదలైంది. ఉమ్మడి జిల్లాలో కీలక ఓటు బ్యాంక్, క్యాడర్ ఉన్న కమ్యూనిస్టు పార్టీలతో పొత్తులు, సీట్ల సర్దుబాటుపై చర్చ సాగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల నుంచి కాంగ్రెస్‌తో సీపీఐ అధికారికంగా పొత్తు కొనసాగడంతో ఈ ఎన్నికల్లోనూ అధికార కాంగ్రెస్‌తో పాటు, సీపీఎంతోనూ సీపీఐ మైత్రి సాగించాలని ప్రాథమికంగా నిర్ణయించింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- వామపక్షాలతో కాంగ్రెస్ మైత్రికి ఛాన్స్!
- బలమున్నచోట్ల సీట్లు కోరుతున్న వామపక్షాలు
- పొత్తులతో సంబంధం లేకుండా అభ్యర్థుల ఎంపికకు కాంగ్రెస్ కసరత్తు
- కాంగ్రెస్‌కు సవాల్ విసురుతున్న బీఆర్ఎస్
- అన్ని సీట్లలో పోటీచేసి సత్తాచాటాలని బీజేపీ నిర్ణయం

అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా బరిలో నిలిచిన సీపీఎం, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రధాన భాగస్వామ్యమైన ఇండియా కూటమితో కలిసి పనిచేయగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐతో పొత్తును కొనసాగిస్తూ కాంగ్రెస్ కలిసి వస్తే ఆ పార్టీతో ఎన్నికలకు వెళ్లాలని భావిస్తోంది. ఈ పొత్తులపై ఇప్పటికే వామపక్ష పార్టీల్లో చర్చ మొదలైనా కాంగ్రెస్‌లో నియోజకవర్గాల్లో అక్కడక్కడా ముఖ్యనేతలు మాట్లాడుతున్నా, పార్టీ పరంగా నిర్ణయం వెలువడాల్సి ఉంది. నోటిఫికేషన్ వచ్చేనాటికి పొత్తులపై స్పష్టత వస్తుందనే అంచనా కాంగ్రెస్, కమ్యూనిస్టు నేతల్లో కనిపిస్తోంది.

బలమున్న చోట స్థానాలను కోరే యోచనలో సీపీఐ

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకున్న సీపీఐ, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లోనూ మైత్రిని కొనసాగించింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కుదిరిన అవగాహన మేరకు ఆ పార్టీకి దక్కిన ఎమ్మెల్సీ స్థానాన్ని సైతం పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యానికి కేటాయించడం ద్వారా సీపీఐ జిల్లాలో ప్రాధాన్యాన్ని నిలబెట్టుకుంది. ఇదే ఒరవడిలో తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఆ పార్టీ కాంగ్రెస్‌తో మైత్రిని కొనసాగించడంతో పాటు, సోదర వామపక్ష పార్టీ సీపీఎంతోనూ కలిసి వెళ్లాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. సీపీఐకి పట్టున్న దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో జడ్పీటీసీ, ఎంపీపీ పదవులతో పాటు, మండలాల్లో ఎంపీటీసీ స్థానాలు, సర్పంచ్ పదవులను ఆశిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇతర నియోజకవర్గాల్లోనూ పార్టీకి బలమున్నచోట ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను పొత్తులో భాగాంగా కోరాలని భావిస్తోంది. ఈనెల 8వతేదీ తర్వాత పొత్తులపై స్పష్టత వస్తుందని చెబుతున్న పార్టీ నేతలు మరోవైపు క్యాడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు.

కలిసొచ్చే పార్టీతో పొత్తుకు సిద్ధమవుతున్న సీపీఎం

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒంటరిగా పోటీ చేసిన సీపీఎం, లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిలో ఉంటూ నల్లగొండ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క భువనగిరి లోక్‌సభ స్థానంలోనే పోటీచేసిన...

- మిగతా 6వ పేజీలో...

తుట్టెలు కడుతున్న రేషన్ బియ్యం

పట్టించుకోని అధికారులు

మోత్కూరు,అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి):రేషన్ దుకాణాల్లో బియ్యం పురుగు పట్టి తుట్టెలు కడుతోంది. ఆ బియ్యాన్నే పంపిణీచేస్తున్నారని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తుండగా, తుట్టెలు కట్టిన బియ్యాన్ని పక్కనబెట్టి మంచివాటినే ఇస్తున్నామని రేషన్ డీలర్లు చెబుతున్నారు.గతంలో మిగిలిన దొడ్డు బియ్యం, నెలనెలా మిగిలుతున్న బియ్యం తుట్టెలు కట్టాయని రేషన్ డీలర్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటున్నారు.

ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. గత ఏప్రిల్‌లో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీని ప్రారంభించేనాటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణల్లో క్వింటాళ్ల కొద్దీ దొడ్డు బియ్యం నిల్వ ఉంది. రేషన్ డీలర్ల వద్ద నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వం తీసుకోవాల్సి ఉండగా, వాటిని అలానే రేషన్ దుకాణాల్లో ఉంచింది. రేషన్ దుకాణాల్లో ఆరు మాసాలుగా దొడ్డు బియ్యం నిల్వ ఉండటంతో అవి పురుగుపట్టి తుట్టెలు కట్టాయి.

స్టాక్ తగ్గించకపోవడంతో పెరుగుతున్న నిల్వలు

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక నెల రేషన్ దుకాణానికి కేటాయించిన బియ్యం పంపిణీ అనంతరం ఆ నెలలో ఎంత మిగిలిందన్న లెక్క డీలర్ల నుంచి తీసుకునే వారు. మరుసటి నెలలో ఆ దుకాణం కోటాలోంచి వారి వద్ద మిగిలిన బియ్యం మొత్తాన్ని తగ్గించి మిగతా కోటాను పంపేవారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతీ నెల రేషన్ దుకాణం పరిధిలో ఉన్న కార్డుదారుల సంఖ్యను బట్టి బియ్యం కోటాను రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తోంది. ప్రతీ నెల అందుబాటులో లేక కొందరు లబ్ధిదారులు బియ్యం తీసుకెళ్లకపోవడమనేది సహజం. పైగా ఇప్పుడు రేషన్ బియ్యాన్ని ఎక్కడ నుంచైనా తీసుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో బతుకుదెరువు కోసం పట్టణ ప్రాంతాల్లో ఉండే వారు రేషన్‌కార్డు గ్రామాల్లో ఉన్నా రేషన్ మాత్రం పట్టణాల్లో తీసుకుంటున్నారు. దీంతో రేషన్ డీలర్ల వద్ద ప్రతీ నెల కొంత బియ్యం మిగులుతోంది. మిగిలిన బియ్యం మరుసటి నెలలో తగ్గించకపోవడంతో నిల్వలు పెరుగుతున్నాయి.

ధర్మ పరిరక్షణకు కృషిచేయాలి

సుప్రీంకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎన్‌వీ.రమణ



చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న జస్టిస్ ఎన్‌వీ.రమణ

చింతపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ హిందూ ధర్మపరిరక్షణకు కృషి చేయాలని సుప్రీంకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎన్‌వీ.రమణ అన్నారు. శనివారం చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో సాయినాథుడి ఆయన దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, రెండో షిర్డీ క్షేత్రంగా చింతపల్లి సాయిసన్నిధి ప్రసిద్ధి చెందుతోందన్నారు. భక్తుల కోర్కెలు తీర్చే సాయినాథుడి దర్శించుకోవడం ద్వారా జీవితంలో కష్టాలు తొలగిపోతాయన్నారు. ఆలయ అభివృద్ధికి, హిందువుల పవిత్రను కాపాడేందుకు ఆలయంలో సుమారు 300 గోవులను పెంచడంతో పాటు, భక్తులకు నిత్య అన్నప్రసాద వితరణకు ఆలయ కమిటీ కృషిచేయడం అభినందనీయమన్నారు. జస్టిస్ ఎన్‌వీ.రమణకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, వూరె కృష్ణయ్య, గోశాల ఇన్‌చార్జి కుంభం పుల్లారెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌ను సందర్శించిన జస్టిస్ ఎన్‌వీ.రమణ

(ఆంధ్రజ్యోతి, నాగార్జునసాగర్): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ శనివారం సందర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థాన జాయింట్ ఎగ్జిక్యూటివ్ అధికారి వెంకయ్యచౌదరి తండ్రి చలమయ్య ఇటీవల మృతిచెందటంతో ఆంధ్రప్రదేశ్‌లోని బెల్లంకొండవారిపాలెంలో నిర్వహించిన పెద్దకర్మకు జస్టిస్ రమణ హాజరయ్యారు. శుక్రవారం రాత్రి సాగర్ విజయవిహార్ అతిథిగృహానికి చేరుకున్న జస్టిస్ రమణ శనివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య సలహాదారుడు శ్రీనివాసరాజుతో కలిసి సాగర్ ప్రధాన డ్యాం, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, నాగార్జునకొండను సందర్శించారు. పర్యాటకశాఖ గైడ్ సత్యనారాయణ ఆయనకు సాగర్ విశేషాలను వివరించారు. ఆయన వెంట తిరుమలగిరి తహసీల్దార్ అనిల్‌కుమార్, సాగర్ ఎస్‌ఐ ముత్తయ్య, ప్రాజెక్టు ఏఈ కృష్ణయ్య, ఎస్‌పీఎఫ్ ఆర్‌ఐ శ్రీనివాసరావు, దండ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులకు రాజకీయ సమాధే

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజులశ్రీనివాస్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో చక్రహరి రామరాజు, తదితరులు

నల్లగొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులకు రాజకీయ సమాధి తప్పదని, కోర్టులను అడ్డం పెట్టుకొని రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూస్తే రాష్ట్రంలో అగ్గి రాజేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్‌తో ఆమోదించాల్సిన బాధ్యత బీజేపీదేనని స్పష్టం చేశారు. రాష్ట్ర జనాభాలో 60శాతానికి పైగా ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, అయితే రెడ్డి జాగృతికి చెందిన కొంతమంది కోర్టులను అడ్డం పెట్టుకొని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లను అడ్డుకుంటే భవిష్యత్‌లో బీసీలంతా ఏకమై రాజకీయ సమాధి చేస్తారని హెచ్చరించారు. ఉన్న జనాభా కంటే 18శాతం రిజర్వేషన్లు తక్కువ చేసి 42శాతంతో బీసీలకు సరిపెట్టి స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినా, రెడ్డి జాగృతి హైకోర్టుకు వెళ్లడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 5శాతం ఉన్న రెడ్డి సామాజికవర్గం వారు 80ఏళ్లుగా 90శాతం పదవులు అనుభవిస్తూ బీసీలకు రావాల్సిన వాటాను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఈనెల 8న హైకోర్టులో బీసీ రిజర్వేషన్ కేసు ఉన్నందున, ఎన్నికలు ఉండవని, బీసీ రిజర్వేషన్ అమలు కాదంటూ కొంత మంది ప్రచారం చేయడం తగదన్నారు. 50శాతం సామాజిక రిజర్వేషన్లు దాటకూడదని ఎక్కడా లేదని, అగ్ర కులాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో 10శాతం రిజర్వేషన్ కల్పించిన నాడే 50శాతం సీలింగ్ పోయిందన్నారు. బీసీలకు రిజర్వేషన్ పెంచినప్పుడే 50శాతం సీలింగ్ గుర్తుకురావడం శోచనీయమన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల పెంపుపై అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. రెడ్డి జాగృతిపై రాజకీయ పార్టీల్లో ఉన్న రెడ్డీలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రెడ్డీలు ఎటూవైపో తేల్చుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు కాసోజు విశ్వనాథం, నల్ల సోమ మల్లన్న, కేశబోయిన శంకర్ ముదిరాజ్, నకిరేకకంటి కాశయ్య గౌడ్, జెల్లా ఆదినారాయణ, వాడపల్లి సాయిబాబా, గోలి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం నల్లగొండ లయన్స్ క్లబ్ వారోత్సవాలను ఎన్జీ కళాశాల మైదానంలో ఆమె ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదో రకంగా మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. మానసిక ఒత్తిడి తగ్గాలంటే జీవన విధానం మార్చుకోవాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు సాధ్యమైనంత వరకు స్మార్ట్ ఫోన్‌ను పక్కన పెట్టాలన్నారు. నడక వల్ల ప్రశాంతత చేకూరుతుందని, ఒత్తిడి దూరమవుతుందన్నారు. మానసిక ఆరోగ్యంపై లయన్స్ క్లబ్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం ఎంతో ప్రయోజనకరమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ రేపాల మదన్‌మోహన్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, మోహన్‌రావు, ప్రసాద్, సతీష్‌కుమార్, రామకృష్ణ, అశోక్‌రెడ్డి, రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి 'ప్రజావాణి' రద్దు

జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఈ నెల 6న నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిశాకే 'ప్రజావాణి' నిర్వహిస్తామని, ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

విషాదాంతాలు

- ఈతకు వెళ్లి ఇద్దరు ఇంటర్ విద్యార్థులు మృతి
- వాగులో పడి ప్రైవేట్ ఉద్యోగి
- వేర్వేరు ప్రమాదాల్లో వృద్ధుడు, ట్రాక్టర్ డ్రైవర్
- బైక్ కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో పలు విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో పూర్వ విద్యార్థులతో కలిసి ఈతకు వెళ్లిన ఇంటర్ విద్యార్థుల్లో ఇద్దరు మృతి చెందగా, సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలో వాగులో పడి మరో వ్యక్తి మృత్యువాత పడ్డాడు. అదేవిధంగా నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలో ద్విచక్రవాహనాలు ఢీకొని వద్ధుడు, కట్టంగూరు మండలంలో ట్రాక్టర్ ట్రాలీ మీది నుంచి వెళ్లడంతో డ్రైవర్ మృతి చెందాడు. అదేవిధంగా తండ్రి ద్విచక్రవాహనం కొనివ్వలేదని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుండెపోటుతో ప్రైవేట్ ఉద్యోగి కొండమల్లేపల్లి మండలంలో మృతి చెందాడు. ఆయా సంఘటనలతో విషాదఛాయలు నెలకొన్నాయి. 6

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర

- అమ్మవారికి ప్రముఖుల ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న మహిళల కోలాట ప్రదర్శన

దేవరకొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో దుర్గాదేవి పూజలను శనివారం ఘనంగా నిర్వహించారు. దేవరకొండ పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం, హనుమాన్‌నగర్ దేవాలయం, మార్కండేయస్వామి దేవాలయం, పెద్ద రామాలయంతో పాటు వివిధ కాలనీలలో దుర్గామాతలకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి చీరలు వేలంపాట నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, కన్యకాపరమేశ్వరి దేవాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ వేర్వేరుగా పూజలు చేశారు. అనంతరం పట్టణంలో శోభాయాత్ర నిర్వహించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీల నిర్వాహకులు చీదెళ్ల వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నర్సింహ, పానగంటి మల్లయ్య, కొత్త సుబ్బారావు, సిరాజ్‌ఖాన్, పల్లా నర్సింహారెడ్డి, మారేపాకల అరుణ సురేష్ గౌడ్, ముత్యాల సర్వయ్య, జాన్‌యాదవ్, పగిడిమర్రి రఘురాములు, నక్క వెంకటేష్ యాదవ్, నేతాళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చి విశేషంగా పూజలందుకున్న కనదుర్గ అమ్మవారి శోభాయాత్ర శనివారం శోభాయమానంగా సాగింది. అంగడిపేట, అంగడిపేట ఎక్స్‌రోడ్డు, గుడిపల్లి మండలకేంద్రంతో పాటు ఘనపురం, పోల్కంపల్లి, బీమనపల్లి గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారని తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో భవానీ మాలధారులు, భక్తులు వివిధ రూపాల్లో కొలిచారు. నవరాత్రి ముగియడంతో శనివారం ప్రత్యేక వాహనాల్లో ఏర్పాటు చేసిన వాహనాల్లో అమ్మవారిని ఆసీనులను చేసి వాయిద్యాలు, డీజేల మధ్య గ్రామాల పురవీధుల గుండా శోభాయమానంగా ఊరేగించారు. కోలాట ప్రదర్శనలు, భజన సంకీర్తనలు, ఆటా-పాటలతో శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. దారి పొడువునా అమ్మవారికి భక్తులు నీరాజనాలు పలికారు. సమీపంలోని ఏకేబీఆర్ రిజర్వాయర్ కాల్వలో నిమజ్జనం చేశారు. అంతకుముందు మండపాల్లో అమ్మవారి లడ్డు, వస్త్రాలను వేలంపాట నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నెర్మటి సతీష్‌రెడ్డి, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, వీరమళ్ల పరమేశ, బొల్లు గోవింద్ యాదవ్, బొల్లు సత్యనారాయణ, వంగాల జనార్ధన్‌రెడ్డి, అమరేంద ర్‌రెడ్డి, వడ్లపల్లి మణిపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బుయ్య కోటి, నీలం శ్రీను, అబ్బనవోని కృష్ణయ్య, శ్రీనయ్య, వెంకటయ్య, పరమేష, శ్రీను, అంజనేయులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండలకేంద్రంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత ప్రతిమ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీల లక్ష్మయ్య, దాచేపల్లి నరేందర్, ఊరే జనార్దన్, నరేష్, సంధ్య, మమత తదితరులు పాల్గొన్నారు.


దేవరకొండ హనుమాన్‌నగర్ దుర్గామాత విగ్రహం ఎదుట పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్


అంగడిపేట ఎక్స్‌రోడ్డులో కోలాటలు వేస్తున్న మహిళలు, చిన్నారులు




దేవరకొండ: వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, నిర్వాహకులు


దేవరకొండ: పెద్దరామాలయం దుర్గాదేవి పూజల అనంతరం ఊరేగింపు, శోభాయాత్ర నిర్వహిస్తున్న నిర్వాహకులు


దుర్గామాత శోభాయాత్ర (ఇన్‌సెట్‌లో), మహిళల కోలాటం

మురుగుకాల్వలు లేక ఇబ్బందులు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చింతపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని 34గ్రామపంచాయతీలు ఉన్న వాటిలో కనీసం పూర్తిస్థాయిలో మురికి కాల్వలు లేక మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు నిత్యం దుర్వాసనతో ఇబ్బందులు పడుతన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం పొంచిఉన్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ప్రధానంగా వెంకటంపేట (తీదేడు), ఎం.మల్లేపల్లి, బోటిమిదితండా, వెంకటేశ్వరనగర్, ఉమ్మాపురం, తక్కళపల్లి, సాయిరెడ్డిగూడెం, పలు గ్రామాల్లో మురుగునీరు సీసీ రోడ్లపై ప్రవహిస్తోంది. ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలు మురుగునీటితో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. మురుగునీరు కారణంగా దోమలు ప్రబలి రోగాల బారిన పడుతున్నారు.


తీదేడులో సీసీ రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

మల్లేష్‌కు పలువురు నాయకుల పరామర్శ


సుమిత్ర మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సతీ వియోగంలో ఉన్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డబ్బీకార్ మల్లేష్‌ను ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. మల్లేష్ సతీమణి సుమిత్రభాయి శుక్రవారం మృతి చెందగా శనివారం జరిగిన అంత్యక్రియలకు పార్టీ, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ పార్టీకి ప్రజలకు ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సుమిత్ర మృతదేహం వద్ద నివాళులర్పించారు.

మల్లేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి, చెరుపల్లి సీతారాములు, బీజేపీ నాయకులు సాధినేని శ్రీనివాసరావు, తల్లం అశోక్, అనంతుల శంకరయ్య, వస్కుల మట్టయ్య, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పాలడుగు ప్రమీల, నాగమణి, వరలక్ష్మి, నజీర్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని చర్చీలను తొలగించాలి

కొండమల్లేపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన చర్చీలను తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొలుముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలో అక్రమంగా చర్చీలను నిర్మించి రాత్రి వేళ చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించేలా మైకులు, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. శనివారం ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్లలో గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. అక్రమంగా నిర్మించిన చర్చీలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా చర్చీలను నిర్వహిస్తూ చుట్టుపక్కల వారిని ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు ఏరుకొండ రాము, గణపురం రాంబాబు, జితేందర్, గోపి, లక్ష్మణ్, కిశోర్ తదితరులు ఉన్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

క్రీడా మైదానంలా పంట పొలం



మిర్యాలగూడ పట్టణం శరవేగంగా విస్తరిస్తోంది. పంట పొలాలు ప్లాట్లుగా మారుతుండగా, ఆయా స్థలాల్లో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. చుట్టూ ఎత్తయిన భవనాలు మధ్యలో ప చ్చని పంట పొలం. క్రీడామైదానాన్ని తలపిస్తూ క నిపిస్తున్న ఈ చిత్రం. పట్టణంలోని నాగార్జున సాగర్ - మండల వారి కాలనీ నడుమ కనిపించ గా 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్

న్యూస్ బాక్స్

విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదు

మిర్యాలగూడటౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా పండగ ముందు బకాయిలు విడుదల చేస్తామని మాటిచ్చిన ప్రభుత్వం ఇంతవరకూ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని, అత్యధిక నిధులు విడుదల చేస్తున్నామని ప్రచారం చేసుకోవడమే తప్ప విద్యార్థులకు చేసిందేమీ లేదన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు సైతం ఆందోళన కార్యక్రమాలకు పూనుకోగా, నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థులు కళాశాలల యాజమాన్యాల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని, ఫీజులు చెల్లించలేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే విద్యార్థులతో కలిసి మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, శ్రీను, అంజి తదితరులు పాల్గొన్నారు.

శబరిమల పవిత్రతను కాపాడాలి

చింతపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శబరిమల పవిత్రతను కాపాడాలని ఇబ్రహీంపట్నం ఆలయ కమిటీ నిర్వాహకులు చంద్రమోహన్ తెలిపారు. శనివారం చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)లో ఈ నెల 22న శబరిమల పాదయాత్రకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప దీక్షతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. పాదయాత్రలో పాల్గొనేవారు ఈ నెల 15 తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తాంత్రిక స్వామి సత్యనారాయణ, ఇడుకుళ్ల భరత్‌కుమార్, విఘ్నేష్, గారాల వెంకటేష్, మల్లోజు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఆర్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు

- మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే బాలు

దేవరకొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో దామోదర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఇటీవల మృతి చెందిన మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి భౌతిక కాయానికి శనివారం ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. దామోదర్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపిన వారిలో జిల్లా కాంగ్రెస్ కోఆర్డినేటర్ ఎంఎ. సిరాజ్‌ఖాన్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ఉన్నారు.

ఖాళీలను సర్దుబాటు చేయడంలో నిర్లక్ష్యం

తిరుమలగిరి(సాగర్) అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి, పదోన్నతుల ద్వారా ఖాళీ అయిన స్థానాల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి నెల రోజులు పూర్తయింది. మండల పరిధిలో పలు చోట్ల ఖాళీ అయిన స్థానాల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంలో ఎంఈవో నిర్లక్ష్యం చేస్తున్నారని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎరనాగుల సైదులు ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని యల్లాపురం, బోజ్యతండా ప్రాథమిక పాఠశాలల్లో పదోన్నతుల తర్వాత ఖాళీఅయ్యాయి. ఆ స్థానాలను మండల స్థాయిలో సర్దుబాటు చేయడంలో ఎంఈవో పక్షపాత ధోరణి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. తిరుమలగిరి, నేతాపురం ప్రాథమిక పాఠశాల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయ సంఘ నాయకులను సర్దుబాటు చేయకుండా వారికి నచ్చిన పాఠశాలలోనే పనిచేసేలా చూస్తున్నారని ఆరోపించారు. కావాలనే సంఘం నాయకులను అవసరమైన పాఠశాలలకు అదనంగా ఉన్న ఉపాధ్యాయులను పంపకుండా జాప్యం చేయడాన్ని ఆయన ఖండించారు. ఈ విషయంపై తక్షణమే జిల్లా విద్యాధికారి స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.

రైళ్ల రాకపోకల వివరాలు

మిర్యాలగూడ మీదుగా.. గుంటూరు, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం వైపునకు..

నెం	ట్రైన్ నెం	రైలు పేరు	వచ్చేది	పోయేది	వారం
1.	07609	పూర్ణ- తిరుపతి స్పెషల్	00-13	00-15	గురువారం
2	17232	నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్	01-29	01-30	ఆది/మంగళ
3	17222	లోకమాన్యతిలక్-విశాఖ ఎక్స్‌ప్రెస్	04-14	04-15	సోమ/శుక్ర
4	12806	జన్మభూమి సూపర్‌ఫాస్ట్	08-57	08-58	డైలీ
5	12756	భావ్‌నగర్ సూపర్‌ఫాస్ట్	09:30	09:31	ఆదివారం
6	07791	కాచిగూడ-నడికుడి	11:55	11:57	ఆదివారం మినహా
7	07046	సికింద్రాబాద్-డిబ్రూఘర్ స్పెషల్	13:05	13:06	సోమవారం
8	07638	శ్రీనగర్ - తిరుపతి	13:06	13:07	మంగళవారం
9	07699	నాగర్‌సోల్-బెజవాడ	13:10	13:11	ఆదివారం
10	17230	శబరి ఎక్స్‌ప్రెస్	14:22	14:23	డైలీ
11	17645	రేపల్లె ఎక్స్‌ప్రెస్	14:46	14:47	డైలీ
12	12704	ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్	17:54	17:55	డైలీ
13	12748	పల్నాడు ఎక్స్‌ప్రెస్	18:00	18:01	డైలీ
14	17016	విశాఖ ఎక్స్‌ప్రెస్	18:44	18:45	డైలీ
15	12604	చెన్నై సూపర్‌ఫాస్ట్	19:14	19:15	డైలీ
16	12734	నారాయణాద్రి సూపర్‌ఫాస్ట్	20:04	20:05	డైలీ
17	07446	లింగంపల్లి- కాకినాడస్పెషల్	20:54	20:55	మంగళ, గురు, శని
18	08580	సికింద్రాబాద్ - విశాఖ స్పెషల్	21:30	21:32	గురువారం
19	07509	హైదరాబాద్ - తిరుపతి స్పెషల్	22:02	22:03	గురువారం
20	07435	నాగర్‌కోల్ వీక్లి స్పెషల్	22:20	22:22	శుక్రవారం
21	07189	హెచ్‌సాహిబ్- ఈరోడ్ స్పెషల్	23:07	23:09	శుక్రవారం
22	08586	మహబూబ్‌నగర్-విశాఖపట్నం	23:10	23: 12	బుధవారం
23	07165	హైదరాబాద్ - కటక్ స్పెషల్	23:10	23:12	గురువారం
24	67775	డెమో	23:40	---	డైలీ
25	07191	కాచిగూడ మధురై స్పెషల్	23:15	23:17	సోమవారం
26	07695	సికింద్రాబాద్-రామంతపురం స్పెషల్	23:20	23:21	బుధవారం
27	67777	డెమో	---	23:45	డైలీ

మిర్యాలగూడ మీదుగా.. నల్లగొండ, హైద్రాబాద్, సికింద్రాబాద్ వైపునకు..

నెం.	ట్రైన్ నెం	రైలు పేరు	వచ్చేది	పోయేది	వారం
1	07610	తిరుపతి- పూర్ణ స్పెషల్	01-20	01-21	బుధవారం
2	12603	చెన్నై సూపర్‌ఫాస్ట్	01:39	01:40	డైలీ
3	07192	మధురై- కాచిగూడ ఎక్స్‌ప్రెస్	01:45	01:47	గురువారం
4	07436	నాగర్‌సోల్ - కాచిగూడ వీక్లీ స్పెషల్	02:00	02:02	శుక్రవారం
5	12733	నారాయణాద్రి సూపర్‌ఫాస్ట్	02:43	02:45	డైలీ
6	08585	విశాఖ-మహబూబ్‌నగర్	02:45	02:47	బుధవారం
7	07632	నాగర్‌సోల్-హైదరాబాద్	02:45	02:47	సోమవారం
8	17015	విశాఖ ఎక్స్‌ప్రెస్	03:29	03:30	డైలీ
9	07445	కాకినాడ పోర్ట్-లింగంపల్లి ఎక్స్	03:39	03:40	మంగళ/గురు/శని
10	07510	తిరుపతి- హైదరాబాద్‌స్పెషల్	03:55	03:56	శనివారం
11	67778	డెమో	05:30	---	డైలీ
12	67776	డెమో	----	05:35	డైలీ
13	08579	విశాఖ-సికింద్రాబాద్	05:44	05:45	గురువారం
14	12703	ఫలక్‌నామా సూపర్‌ఫాస్ట్	06:51	06:52	డైలీ
15	07696	రామంతపురం-సికింద్రాబాద్	07:04	07:05	శనివారం
16	12747	పల్నాడు సూపర్‌ఫాస్ట్	07:40	07:41	డైలీ
17	17229	శబరి ఎక్స్‌ప్రెస్	08:32	08:33	డైలీ
18	17646	రేపల్లె ఎక్స్‌ప్రెస్	11:05	11:06	డైలీ
19	07047	డిబ్రూఘర్-సికింద్రాబాద్‌స్పెషల్	11:20	11:22	శనివారం
20	12755	భావ్‌నగర్ ఎక్స్‌ప్రెస్	11:32	11:33	గురువారం
21	12805	జన్మభూమి సూపర్‌ఫాస్ట్	15:10	15:11	డైలీ
22	17221	లోకమాన్యతిలక్ ఎక్స్‌ప్రెస్	15:29	15:30	బుధ/శని
23	07166	కటక్- హైద్రాబాద్	15:30	15:32	గురువారం
24	07792	డెమో	16:50	16:52	ఆదివారం మినహా
25	17231	నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్	16:59	17:00	శుక్ర/ఆది
26	07190	ఈరోడ్- నిడదవోలు	18:48	18:49	ఆదివారం
27	07698	బెజవాడ-నాగర్‌సోల్	19:24	19:25	శుక్రవారం

-(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడటౌన్)

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : ఓజీ, వెంకటేశ్వర: మిరాయ్, రాఘవ: ఓజీ, విట్రోస్: ఓజీ, కిష్కింధపురి, మిరాయ్, దక్ష, భద్రకాళి, దేవరకొండ : మనోజ్ : ఓజీ, మైత్రి వెంకటేశ్వర : మిరాయ్